
నిక్కర్లతో రావద్దు..!

యాడికి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయానికి నిక్కర్లు (షార్ట్స్) ధరించి రావద్దని అధికారులు నోటీసులు అంటించారు. నిక్కర్లు వేసుకుని వస్తే కార్యాలయం లోపలకు అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు కొందరు యువకులు నిక్కర్లతో వస్తుండటంతో తహసీల్దారు ప్రతాప్ రెడ్డి ఇలా నోటీసు అంటించారు. తహసీల్దారు మంచిపని చేశారని కార్యాలయానికి వచ్చినవారు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చేవారు పద్ధతిగా ఉండాలని అన్నారు.



కార్యాలయం వద్ద నోటీసు

శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానము,
కదిరి పట్టణము, శ్రీ సత్యసాయి జిల్లా,
ఫోన్:08494-221066,221366

e-Procurement Short Tender Notice (3rd Time Calling)

శ్రీ స్వామి వారి తూర్పు రాజగోపురము రాతీ భీమ్ మరమ్మత్తు పనికి e-Procurement ద్వారా ఆన్ లైన్ షార్ట్ ఇ-టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in వైబ్ సైట్‌ను చూడగలరు.

సం/- వి.శ్రీనివాసరెడ్డి, కార్యనిర్వహణాధికారి

క్షమాపణ చెప్పు పోసానీ..!

అనంతపురం అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పోసాని కృష్ణ మురళి బహిరంగ క్షమాపణలు చెప్పాలని తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి బంగి నాగ డిమాండ్ చేశారు. లేదంటే ఆయన ఇంటిని ముట్టడించి, చెప్పులతో కొడతామని హెచ్చరించారు. నగరంలోని క్లాక్ టవర్ వద్ద తెలుగు యువత, ఎస్సీ సెల్ నాయకులు.. పోసాని దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. పోసానిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంపై అసత్యప్రచారం చేస్తున్న వైసీపీ సోషల్ మీడియా సైకోలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామాంజి, పృథ్వీ, అనిల్‌కుమార్, విద్యాసాగర్, శరత్ తదితరులు పాల్గొన్నారు.


పోసాని దిష్టిబొమ్మ దహనం చేస్తున్న తెలుగు యువత నాయకులు











PVKK INSTITUTE OF TECHNOLOGY
(Approved by AICTE, New Delhi & Affiliated to JNTU, Anantapur)
(Accredited by NBA & NAAC with "A" grade)
(Autonomous)
Sanapa road, Rudrampeta, Anantapuramu
(A Non Minority Institution)

APPGECET-2024 SPOT & CATEGORY-B ADMISSIONS (2024 - 25)

AP PGECET Spot admissions for left over vacancies along with EWS in M.Tech Course will be held at college office on 15-11-2024 and admissions for Category-B in M.Tech Course will be held from 14-11-2024 to 20-11-2024 at the college office from 9.00 AM to 5.00 PM. The interested students may attend with all original certificates along with necessary fee. The admissions will be made as per the APSCHE guidelines

Branch in Engineering	CIVIL	EEE	MECH	ECE	CSE
Available M.Tech Specialization	Str. Engg.	EPS	CAD/CAM	DECS	CSE

Eligibility:
1) The candidates who have not taken admission at any college.
2) GATE/APPGECET-2024 qualified or candidates who secured 50% or above (OC) and 45% or above (BC/SC/ST) in B.Tech or its equivalent.

Contact:
8886630029, 8688810055, 9550616861
Sd/-Principal

ఏసీబీ కేసు ఉన్నా..

ప్రాధాన్యం

రామగిరి ఏఓగా వెంకటేశ్వరప్రసాద్

స్థానిక నాయకుల అభ్యంతరం

అనంతపురం అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఏసీబీ కేసు ఎదుర్కొంటున్న అధికారికి సస్పెన్షన్ ఎత్తేసి.. ప్రాధాన్య పోస్టు ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది. గత ఏడాది ఆగస్టులో ఓ డీలర్‌తో రూ.15వేలు లంచం తీసుకున్న కేసులో రాప్తాడు మండల ఏఓ వెంకటేశ్వరప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ గిరిబాబును ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏఓను రిమాండ్‌కు తరలించారు. ఏసీబీ కేసు కారణంగా ఇద్దరినీ అధికారులు సస్పెండ్ చేశారు. గత నెలలో వారి సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ వ్యవసాయ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఏసీబీ కేసులు ఎదుర్కొంటున్నవారికి ప్రాధాన్యంలేని పోస్టులు ఇవ్వాలని నిబంధన ఉంది. ఉన్నతాధికారులు ఆయనను రామగిరి మండల వ్యవసాయ అధికారిగా నియమించారు. ఉమ్మడి జిల్లా పరిధిలోనే పోస్టింగ్ ఇచ్చారు. శ్రీసత్యసాయి జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు.. రామగిరి ఏఓగా వెంకటేశ్వర ప్రసాద్‌ను పంపగా.. స్థానిక నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. జిల్లా వ్యవసాయ అధికారి ఈ విషయాన్ని కమిషనరేట్‌కు రిపోర్టు చేసినట్లు తెలిసింది. పెనుకొండలోని భూసార సంరక్షణా విభాగంలో ఏఓ పోస్టు ఖాళీగా ఉందని, ఆ స్థానంలో వెంకటేశ్వరప్రసాద్‌ను నియమించాలని సిఫార్సు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. నిబంధనల మేరకు వేరే జిల్లాలో ప్రాధాన్యంలేని పోస్టింగ్ ఇచ్చి ఉంటే వివాదం తలెత్తేది కాదని పలువురు అంటున్నారు.

భూసార, క్రిమిసంహారక పరీక్షలు మరింతగా పెంచాలి: కలెక్టర్

అనంతపురం అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భూసార, క్రిమిసంహారక పరీక్షలు మరింతగా పెంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. గురువారం స్థానిక భూసార, క్రిమిసంహార మందుల పరీక్షా కేంద్రాలు, అనంతపురం ఏడీఏ కార్యాలయాన్ని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మతో కలిసి తనిఖీ చేశారు. భూసార పరీక్షా కేంద్రంలో మట్టి, విత్తన పరీక్షలు చేసే విధానాన్ని పరిశీలించారు. ఆ తర్వాత క్రిమిసంహారక మందుల పరీక్షా కేంద్రం, ఏడీఏ కార్యాలయాన్ని తనిఖీ చేసి, పలు అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏడీఏలు రవి, రోజా పుష్పలత, హేమావతి, టెక్నికల్ ఏఓ వెంకట్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేవుళ్ల భూమికి దిక్కెవరు..?

కబ్జా కోరల్లో దేవాలయ భూములు

పట్టా పాసుపుస్తకాలు పొందిన కొందరు వైసీపీ నాయకులు

పట్టించుకోని దేవదాయశాఖ అధికారులు

కబ్జాకు గురైన దేవాలయ భూములు




బొమ్మనహాళ్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఏమాత్రం భయం లేకుండా దేవుడి మాన్యాలను సైతం కొందరు కబ్జా చేసేస్తున్నారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటూ అక్రమంగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందారు. దేవదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ఆక్రమణలు జరుగుతున్నాయనే విమర్శలు వినవస్తున్నాయి. మండలంలో దేవాలయ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో బళ్లారి రామస్వామి దేవాలయానికి సర్వే నెంబర్ 224-ఎ, 224-బిలో 4.95 ఎకరాల భూమి ఉంది. దీన్ని లీజుకు తీసుకుని సాగు చేసుకుంటున్న రైతు రుణం కోసం ఉద్దేహాళ్ సొసైటీలో 2010లో మార్ట్‌గేజ్ చేయించారు. అయితే 2022లో సర్వేనెంబర్ 224-ఎలో 3.92 ఎకరాలను భూమిని కొన్నట్లుగా చూపి వైసీపీ నాయకులు తమ పేరుపై ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకుని పట్టా పాసు బుక్కులు పొందారు. ఉద్దేహాళ్ గ్రామంలోని విఘ్నేశ్వరస్వామి దేవాలయానికి సర్వేనెంబర్ 181 లో 9.42 ఎకరాలు 182లో 10.57 ఎకరాలు, 241బీలో 2.23 ఎకరాలు, 241-1సీలో 1.99 ఎకరాలు, 224సీలో 2.11 ఎకరాలు, 278లో 2.31 ఎకరాలు భూమి ఉంది. ఈ భూమి మొత్తాన్ని ఇతరులు కబ్జా చేశారు. విఘ్నేశ్వర ఆలయం మొత్తం శిథిలావస్థకు చేరింది. పేకాటకు నిలయంగా మారింది. మండలంలోని లింగదహాళ్, కొళగనహళ్లి గ్రామాల్లో సైతం ఆలయ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయనే ఆరోపణలు ఉన్నా యి. ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని తెలిసినా అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో తెలియని పరిస్థితి.

రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

బొమ్మనహాళ్ మండలంలో దేవాలయాలకు చెందిన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. వాటిని సర్వే చేసి మాకు అప్పగించాలని రెవెన్యూ అధికారులకు విన్నవించాం. ఉద్దేహాళ్‌లో భూములు సాగు చేసుకొన్న వారి రికార్డులు ఇవ్వాలని తెలిపాము. దేవాలయభూములు ఎవరు కబ్జా చేసినా వదిలే ప్రసక్తే లేదు. వాటిని అన్ని ఆధారాలతో స్వాధీనం చేసుకుంటాం.

- బాబు, ఈఓ దేవదాయశాఖ, అనంతపురం







పరిమళించిన పసివారు

మట్టి.. రంగులతో కళాఖండాలు

ఆర్డీటీ ఆర్ట్ ఫెస్టివల్‌లో అద్భుతాలు





వెన్నుతట్టి ప్రోత్సహించాలేగానీ.. ఆకాశంలోని నక్షత్రాలను నేలపై ఆవిష్కరించగలరు. బంక మట్టితో భగవంతుడినే సృష్టించగలరు. సంస్కృతి, సంప్రదాయాలను కళ్లకు కట్టగలరు. అకృత్యాలకు వ్యతిరేకంగా కళల గళాన్ని వినిపించగలరు. అందరూ పసివారే..! అద్భుతమైన ప్రతిభ ఉన్నవారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురం నగరంలోని ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో గురువారం ఆర్ట్ ఫెస్టివల్ నిర్వహించారు. అక్కడికి వచ్చిన వందలాది మంది పసివారు పరిమళించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అద్భుతాలను ఆవిష్కరించారు. రంగోలి, చేతిరాత, న్యాచురల్ కొలేజ్, పిక్చర్ పెయింటింగ్, క్లే మోడల్, ఒరిగామి ఆర్ట్‌వర్క్.. ఇలా ఆరు విభాగాలలో పోటీ పడ్డారు. కర్నూలు, అనంత ఉమ్మడి జిల్లాలోని 37 ప్రాంతాల నుంచి 222 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఒకరికి ఒకరు ఏమాత్రం తీసిపోరు. అందులో కొందరి ఆవిష్కరణలు ఇవి.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్

వెన్నదొంగ.. గోవర్ధనుడు



గొల్లపల్లి తండాకు చెందిన రవినాయక్, పేరమ్మ దంపతుల కుమారుడు గోవర్ధన్ అదే తండా ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. పాఠశాల ముగిసిన తర్వాత రోజూ సాయంత్రం లక్ష్మన్న అనే ట్యూషన్ మాస్టర్ వద్దకు వెళుతుంటాడు. లక్ష్మన్న చదువు చెప్పడంతోపాటు మట్టితో బొమ్మలు తయారు చేయడం నేర్పించేవాడు. ఆ కళను పోటీలో ప్రదర్శించాడు గోవర్ధన్..! స్వామి పేరు పెట్టుకున్నందుకో ఏమో.. వెన్న దొంగ ప్రతిమను అందంగా తీర్చిదిద్దాడు. దీనికోసం 12 రోజులపాటు ప్రాక్టీస్ చేశాడట.

కళ్లెదుట అరణ్యకాండ: సంతోష్‌కుమార్



రావణుడు సీతను అపహరించుకుని వెళ్తున్నపుడు జటాయువు వీరోచితంగా పోరాడి రెక్కలు కోల్పోతుంది. సీతాపహరణ విషయాన్ని శ్రీరాముడికి వివరించి ప్రాణాలు విడుస్తుంది. ఈ ఘట్టాన్ని తన కళతో కళ్లకు కట్టాడు సంతోష్ కుమార్. కణేకల్లు మండలం కురువళ్లి గ్రామానికి చెందిన సురేష్, నాగరత్నమ్మ దంపతుల కుమారుడు. అదేగ్రామంలోని ఎంపీపీ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్నాడు. దాదాపు నెలరోజులపాటు బంకమట్టితో బొమ్మలు తయారు చేయడం నేర్చుకుని, ఆర్ట్ ఫెస్టివల్‌లో క్లేమోడల్ విభాగంలో ఎంతో సుందరంగా అరణ్యకాండ ఘట్టాన్ని ఆవిష్కరించాడు.

మహిళలపై అఘాయిత్యాలు వద్దు: అమర్‌నాథ్



మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలని బొమ్మలతో చెప్పించాడు అమర్నాథ్. గుంతకల్లు మండలం వైటీ చెరువుకు చెందిన రామాంజనేయులు, సువర్ధమ్మ కుమారుడు. స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల నిర్మూలన అంశాన్ని ఎంచుకుని.. ఉపాధ్యాయుల వద్ద వారంరోజులపాటు శిక్షణ పొందాడు. మట్టి బొమ్మలతో మహిళలకు మద్దతుగా నినదించాడు.



మట్టితో కళాఖండాలను తయారు చేస్తున్న చిన్నారులు

విద్యార్థులు అన్ని విషయాలనూ తెలుసుకోవాలి..



విద్యార్థిదశలోనే మన మాతృదేశంలోని అన్ని అంశాల గురించి తెలుసుకోవాలి. అదే ధ్యేయంతో పాఠాలను చె బుతుంటాం. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని వరుణ్‌కు సైగలద్వారానే శిక్షణ ఇచ్చాను. దేశంలోని వివిధ అంశాలను రంగవల్లికలలో చూపించేలా తీర్చిదిద్దాము.

- వాణిశ్రీ, ఉపాధ్యాయిని

చదువే... సారాంశం...



నేటితరం విద్యార్థులు టీవీ, సెల్‌ఫోన్ వంటి పరికరాలపై ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. సెల్‌ఫోన్ మనకు అవసరమే అయినా.. కేవలం ఒక వస్తువుగానే భావించాలి. చదువు పట్ల మొగ్గుచూపాలనే ఈ అంశాన్ని ఎంచుకుని అక్షయ్‌కు శిక్షణ ఇచ్చాను.

- శ్రీనివాస్, ఆర్డీటీ సమ్మిళిత పాఠశాల, కూడేరు

సైగలతోనే శిక్షణ...



బధిర, మూగ పిల్లలకు శిక్షణ ఇవ్వడం నైపుణ్యంతో కూడుకున్న పని. వారికి సైగలతో మాత్రమే బోధించాలి. మా పాఠశాలలోని బధిర, మూగ విద్యార్థులు సైతం సాధారణ విద్యార్థులతో కలిసి అన్నిరకాల యాక్టివిటీస్‌లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నాం. ఈ క్రమంలోనే ఆర్ట్ ఫెస్టివల్‌లో పాల్గొనేలా శిక్షణ ఇచ్చి తీసుకొచ్చాం.

- మారెన్న, ఉపాధ్యాయుడు, కూడేరు

రంగు రంగుల పురోగతి: వరుణ్



కూడేరుకు చెందిన శ్రీకాంత్, అంజనావతి దంపతుల కుమారుడు వరుణ్ దేశ పురోగతిని రంగు రంగుల రంగవల్లికలతో కళ్లకు కట్టాడు. చిన్నతనంలోనే తల్లిని కోల్పోయాడు. తండ్రి శ్రీకాంత్ హోటల్‌లో పనిచేస్తుంటాడు. కూడేరులోని ఆర్డీటీ సమ్మిళిత పాఠశాలలో వరుణ్ నాలుగో తరగతి చదువుతున్నాడు. పుట్టుకతోనే మూగ, బధిరుడు. వాణిశ్రీ అనే ఉపాధ్యాయిని వరుణ్‌కు 15 రోజులపాటు శిక్షణ ఇచ్చారు. ఒలింపిక్స్, కొవిడ్‌కి ఎదురొడ్డి నిలబడడం, భారతీయ సంస్కృతి, ఇస్రో, మేక్ ఇన్ ఇండియా, తదితరాలను రంగవల్లికలతో ఆవిష్కరించాడు వరుణ్.

ఫోన్ వద్దు... పుస్తకం పట్టు: అక్షయ్



సెల్‌ఫోన్ వినియోగం కన్నా పుస్తక పఠనమే మానవాళికి ప్రయోజనకరమని తన కళతో ప్రదర్శించాడు అక్షయ్. కూడేరుకు చెందిన కుమార్, అనిత దంపతుల కుమారుడు అక్షయ్.. స్థానిక ఆర్డీటీ సమ్మిళిత పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలలో శ్రీనివాస్ అనే ఉపాధ్యాయుడి సమక్షంలో పది రోజులుగా బంకమట్టితో బొమ్మలు తయారు చేయడం నేర్చుకున్నాడు. సెల్‌ఫోన్ వల్ల కలిగే అనర్థాలు, పుస్తకాల వల్ల కలిగే ప్రయోజనాన్ని వివరిస్తూ బొమ్మను రూపొందించి ప్రదర్శించాడు.

రైతు బిడ్డలు.. భిన్న ధ్రువాలు: సురేష్



ఒకే తల్లి కడుపున పుట్టారు. ఇద్దరూ భూమినే నమ్ముకున్నారు. కానీ.. వినియోగంలో భిన్నత్వం చూపించారు. ఒకరి భూమిలో గాలి మరలు.. మరొకరి భూమిలో పచ్చటి పొలాలను ఆవిష్కరించాడు సురేష్. కూడేరుకు చెందిన గంగమ్మ, ఎర్రిస్వామి దంపతుల కుమారుడు. వీరు వ్యవసాయం చేస్తుంటారు. సురేష్‌కు పుట్టుకతోనే వినికిడి సమస్య ఏర్పడింది. దీంతో మాటలు రాకుండాపోయాయి. కూడేరు ఆర్డీటీ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. మారెన్న అనే ఉపాధ్యాయుడు సైగల ద్వారానే చదువు నేర్పుతున్నారు. దీంతోపాటు మట్టి బొమ్మల తయారీనీ నేర్పిస్తున్నాడు. ఈ అంశాన్ని 12 రోజులపాటు నేర్చుకున్న సురేష్.. రైతు సోదరులను పొలంలో అద్భుతంగా ఆవిష్కరించాడు.

రేవతి.. ప్రకృతి



కొండల నడుమ నుంచి చెక్‌డ్యామ్‌కు చేరిన వర్షపునీరు.. అటు నుంచి బ్రిడ్జిల కింద కాలువల ద్వారా పొలాలకు చేరే నీరు. ఆ నీటితో పంటపొలాల సాగు.. ఇలా ప్రకృతి సౌందర్యాన్ని ఆవిష్కరించింది రేవతి. పామిడి మండలం ఎద్దులపల్లికి చెందిన నాగరాజు, ఆదిలక్ష్మి దంపతుల కూతురు. నాగరాజు ఆటోడ్రైవర్‌గా పనిచేస్తుండగా ఆదిలక్ష్మి ఇళ్లలో పనిచేస్తుంటారు. అదే గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో రేవతి ఐదో తరగతి చదువుతోంది. ఈ కళను ప్రదర్శించేందుకు 25 రోజులపాటు ప్రాక్టీస్ చేసింది. చుట్టుపక్కల లభించే అరంటు, దుబాయి కాయలు, గవ్వలు, కుసుములు, బీన్స్, చింతపిచ్చలు, గద్దముక్కుకాయలు, చెండుపూలతో ప్రకృతి రమణీయతను కళ్లకు కట్టింది.

ప్రజ్వల్.. జోడు లింగాలు

కూడేరులోని సంగమేశ్వరం జోడు లింగాల ఆలయం ప్రఖ్యాతి గాంచింది. ఆర్డీటీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఆర్ట్ ఫెస్టివల్‌కు జోడులింగాలు కదిలొచ్చాయి. అండేపల్లికి చెందిన రాజు, మంజుల దంపతుల కుమారుడు ప్రజ్వల్.. వీటిని మట్టితో ఆవిష్కరించాడు. కూడేరు ఆర్డీటీ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. చిన్నపుడే తల్లిదండ్రులిద్దరు చనిపోయారు. అవ్వాతాతలు కర్రమ్మ, నాగప్ప వద్ద ఉంటూ బడికి వెళుతున్నాడు. వారంరోజులపాటు ప్రాక్టీస్ చేసి ఆర్ట్ ఫెస్టివల్‌లో మొక్కల కాండాలు, అరటి బెరడు, రాళ్లతో జోడులింగాల నమూనాను తీర్చిదిద్దాడు.



రంగవల్లికలో శ్రీనివాసుడు: సుదర్శిని

ఆర్ట్ ఫెస్టివల్ రంగవల్లుల విభాగంలో కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామిని ఆవిష్కరించింది చిన్నారి సుదర్శిని. కురువళ్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మర్రిస్వామి, రైతుకూలీ శ్రీదేవి దంపతుల కూతురు తను. అదే గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. సుదర్శినికి రంగవల్లులపై ఆసక్తి ఎక్కువ. అందుకే ఇదే విభాగంలో స్వామివారిని తీర్చిదిద్దింది.







మహిళల భద్రత: ప్రవీణ్

మహిళల భద్రత ఇతివృత్తంగా రంగవల్లులను తీర్చిదిద్దాడు ప్రవీణ్. అనంతపురం అంబేడ్కర్ నగర్‌కు చెందిన మల్లీశ్వరి, శ్రీనివాసులు దంపతుల కుమారుడు. మల్లేశ్వరి ఓ హోటల్‌లో పనిచేస్తోంది. శ్రీనివాసులు కొన్నేళ్ల క్రితం చనిపోయారు. ప్రవీణ్ ఆర్డీటీ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను గురించి ఉపాధ్యాయులద్వారా తెలుసుకుని, వారికి భద్రత కల్పించాలనే అంశాన్ని రంగవల్లిక ద్వారా చూపించాడు. అత్యాచారాలు, చులకన భావం, వరకట్న వేధింపులు, యాసిడ్ దాడులు, హత్యలను నివారించాలని రంగవల్లికల ద్వారా డిమాండ్ చేశాడు ప్రవీణ్.

సహకార వ్యవస్థను బలోపేతం చేయాలి

జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత నిర్మాణంలో సహకార సొసైటీ పాత్ర ప్రాముఖ్యతను చాటుకుంటున్నాయని ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ అన్నారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను గురువారం స్థానిక ఎన్టీఆర్ సహకారభవన్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 20వతేదీ వరకు వారోత్సవాలు జరగనున్నాయన్నారు. జిల్లాలో సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. జిల్లా సహకారశాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి మాట్లాడుతూ సహకార వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగానే సొసైటీల కంప్యూటరైజేషన్, గోడౌన్ల నిర్మాణం-నిర్వహణ, పెట్రోలు బంకులు ఏర్పాటు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీఎల్‌సీఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా సహకార విద్యాధికారి మురళీ మోహన్, సబ్‌డివిజనల్ అధికారి బాలగంగాధర్ పాల్గొన్నారు.

సంతోష్ ట్రోఫీని విజయవంతం చేయాలి

: కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సంతోష్ ట్రోఫీని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. సంతోష్‌ట్రోఫీని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. గురువారం నుంచి 19వతేదీ వరకు ఆర్డీటీ స్టేడియంలో ట్రోఫీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డేనియల్ ప్రదీప్ మాట్లాడుతూ.. జిల్లాలో ఫుట్‌బాల్ అభివృద్ధికి, క్రీడాకారుల ప్రోత్సాహానికి ఎంతో దోహదం చేస్తుందన్నారు. టోర్నీలో ఏపీ, తమిళనాడు, అండమాన్ నికోబార్ దీవులు, కర్ణాటక రాష్ట్రాల జట్లు ప్రాతినిథ్యం వహిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

డబ్బులు ఇవ్వం.. భూములనూ ఇవ్వం

మాజీ మంత్రి రాయబారం.. తిప్పికొడుతున్న రైతులు

సోలార్ భూముల కోసం గతంలో భారీగా అగ్రిమెంట్లు

కళ్యాణదుర్గం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తుందని, సోలార్ కంపెనీలకు భూములను అమ్మి సొమ్ము చేసుకోవాలని భావించిన మాజీ మంత్రి ఉష శ్రీచరణ్‌కు చుక్కెదురైంది. అగ్రిమెంట్లు చేసుకున్న రైతులు అడ్వాన్సుగా తీసుకున్న సొమ్మును తిరిగి ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. దీంతో ఆమె దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. వైసీపీ హయాంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం కళ్యాణదుర్గం నియోజకవర్గంలో సుమారు 300 ఎకరాల భూముల కొనుగోలుకు మాజీ మంత్రి ఒప్పందం చేసుకున్నారు. కంబదూరు మండలం మర్రిమాకులపల్లి, ములకనూరు, కుందుర్పి మండలం, కళ్యాణదుర్గం మండలం, మరికొన్ని గ్రామాల్లో రైతులతో అగ్రిమెంట్ రాయించుకున్నారు. ఒక్కొక్క రైతుకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలదాకా చెల్లించారు. తక్కువ ధరకే భూములను ఇవ్వాలని అప్పట్లో రైతులపై ఉష శ్రీచరణ్, ఆమె అనుచరవర్గం బెదిరించింది. వైసీపీ ఘోర పరాజయంతో ఇప్పుడు వారి పప్పులు ఉడకడం లేదు. ఉషశ్రీచరణ్ కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచి వెళ్లిపోయారు. కొన్ని నెలల పాటు ఈ భూముల గురించి ఎవరూ పట్టించుకోలేదు. రైతులు కూడా మిన్నకుండిపోయారు. అయితే వారం రోజుల నుంచి ఉష శ్రీచరణ్ అనుచరవర్గం రైతులతో రాయబారాలు నడుపుతోంది. అగ్రిమెంట్ డబ్బులు వెనక్కి ఇవ్వాలని ఒత్తిడి చేస్తోంది. కానీ రైతులు అంగీకరించడం లేదు. డబ్బులు ఇచ్చేది లేదని, భూములను కూడా అమ్మేది లేదని ఖరాకండిగా చెబుతున్నారు. స్థానిక వైసీపీ నాయకులు కూడా రైతులకు మద్దతు పలుకుతున్నారు. దీంతో మాజీ మంత్రి దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు.

సెంట్రల్ లైబ్రరీ అభివృద్ధికి కృషి

గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభోత్సవంలో ఎంపీ అంబికా

అనంతపురం విద్య, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సెంట్రల్ లైబ్రరీ అభివృద్ధికి కృషి చేస్తామని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ అంబికా, జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎంపీ జెండా ఊపి వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా లైబ్రరీ మరింత అభివృద్ధి చెందాలన్నారు. జేసీ మాట్లాడుతూ సెంట్రల్ లైబ్రరీలో పాఠకులకు, పోటీ పరీక్షల కోసం విద్యార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలను అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, ఆర్డీఓ కేశవనాయుడు, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, గ్రంథాలయ కార్యదర్శి రమా, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.



జెండా ఊపి వారోత్సవాలను ప్రారంభిస్తున్న ఎంపీ

విజేతలకు బహుమతులు

అనంతపురం క్లాక్‌టవర్(ఆంధ్రజ్యోతి): ఆర్ట్ ఫెస్టివల్‌ను ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచోఫెర్రర్ ప్రారంభించారు. ప్రతిభ చాటిన చిన్నారులకు బహుమతులను అందజేశారు. క్లైమోడల్ పోటీల్లో మొదటి బహుమతి అక్షయ్ తేజ(రాప్తాడు), ద్వితీయ బహుమతి సంతోష్ (కురువపల్లి), తృతీయ బహుమతి రాజేష్ (ఉప్పొంక) గెలుచుకున్నారు. హ్యాండ్ రైటింగ్‌లో మనోజ్‌కుమార్ (పోతుకుంట), పల్లవి (చిన్నహోతూరు), స్వాతి (రాళ్లపల్లి) మొదటి మూడు బహుమతులను గెలుచుకున్నారు. న్యాచురల్ కోలేజ్‌లో మొదటి బహుమతి రేవతి(ఎద్దులపల్లి), ద్వితీయ బహుమతి ప్రసాద్ (మార్పురివారిపల్లి), తృతీయ బహుమతి నాగలక్ష్మి (దేవగిరి) గెలుచుకున్నారు. ఒరిగామి ఆర్ట్ వర్క్‌లో అక్షిత (కరుట్లపల్లి), మోక్షిత (ఏటిగడ్డతండా), అఖిల (ధర్మవరం) ఒకటి, రెండు, మూడు బహుమతులు పొందారు. పిక్చర్ పెయింటింగ్‌లో మొదటి బహుమతి సంజయ్‌గౌతమ్ (కురువళ్లి), ద్వితీయ బహుమతి మానస(బొమ్మనహాళ్), తృతీయ బహుమతి పృథ్వి (కరుట్లపల్లి) గెలుచుకున్నారు. రంగోలిలో సుదర్శిని(కురువళ్లి), వరుణ్(దేవరింటిపల్లి), ప్రవీణ్ (అనంతపురం) మొదటి మూడు బహుమతులను గెలుపొందారు. ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాలా ఫెర్రర్, స్పెయిన్‌కు చెందిన స్పాన్సర్లు బహుమతులు ప్రదానం చేశారు. ఆర్డీటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మురళీమోహన్, ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్లు, ఏరియా టీం లీడర్లు పాల్గొన్నారు.



విజేతలతో ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాలా ఫెర్రర్



విజేతలను అభినందిస్తున్న విదేశీయులు

క్రైం కార్నర్

మసీదు మినార్‌పై పిడుగు

● రూ.2లక్షలు నష్టం



పిడుగుపాటుకు దెబ్బతిన్న మినార్ (వృత్తంలో) ఇన్‌సెట్‌లో కింద పడిన మినార్ భాగం

నల్లమాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురమాల గ్రామ నడిబొడ్డున ఉన్న మసీదుపై గురువారం 4.20 నిమిషాలకు పిడుగు పడింది. పిడుగు ధాటికి మసీదు పైభాగంలో ఉన్న మినార్ నేలకొరిగింది. మసీదు ముతవల్లి నిజాంవలీ తెలిపిన మేరకు మసీదులో ఎవరూలేని సమయంలో చిరుజల్లులు పడటంతో పాటు ఉరుములు, మేరుపులతో మినార్‌పై పిడుగు పడిందన్నారు. ఈ సమయంలో ఇక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. మసీదుకు అమర్చిన ఇన్‌వర్టర్, 15 ఫ్యాన్లు, పది ట్యూబ్‌లైట్లు, మోటారుతోపాటు స్టార్టర్, విద్యుత్ వైరింగ్, కాలి బూడిదైందన్నారు. రూ.2 లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం మసీదు మరమ్మతులకు అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



గౌతమ్ (ఫైల్)

రాయదుర్గంరూరల్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశీపురానికి చెందిన విద్యార్థి గౌతమ్ (7) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభాకర్, శైలజ దంపతుల కుమారుడు గౌతమ్ ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. వారం రోజుల క్రితం జ్వరం రావడంతో అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ వుందని నిమోనియా సోకినట్లు గ్రహించి చికిత్స అందించినట్లు తెలిపారు. ఆస్పత్రిలో వారం రోజులుగా చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. విద్యార్థి అక్క నవ్యశ్రీ కూడా డెంగీతో బాధపడుతూ మృతి చెందింది. గ్రామంలో చాలామంది జ్వరాలతో బాధపడుతున్నా వైద్య సిబ్బంది పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

సోషల్ మీడియా పోస్టులపై విచారణ

రాయదుర్గంరూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడనే అనుమానంతో ఆయతపల్లి గ్రామానికి చెందిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త ప్రసాద్‌రెడ్డిని బుధవారం మధ్యాహ్నం పోలీసులు ఇంటికి వచ్చి తీసుకెళ్లి విచారించి వదిలేశారు. పోలీసులు తిరిగి శుక్రవారం సెల్‌ఫోన్ తీసుకెళ్లాలని పిలిపించారు. రాత్రి అయినా కొడుకు ఇంటికి రాకపోవడంతో ప్రసాద్‌రెడ్డి తండ్రి బ్రహ్మానందరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. అభ్యంతరకర పోస్టులు పెట్టాడనే అనుమానంతో కొడుకును తీసుకెళ్లి, విచారించి పంపించి తిరిగి సెల్‌ఫోన్ కోసం పిలిపించి ఇంటికి పంపలేదన్నారు. బ్రహ్మానందరెడ్డి ఉదయం నుంచి సాయంత్రం వరకు కుమారుని కోసం నిరీక్షించారు. దీనిపై సీఐ జయానాయక్‌ను వివరణ కోరగా.. ప్రసాద్‌రెడ్డిని పిలిపించామనీ, విచారించి ఇంటికి పంపినట్లు తెలిపారు.

ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో..

ముగ్గురికి ఏడేళ్ల జైలు శిక్ష

అనంతపురం క్రైం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు ప్రేరేపించేలా చేసిన కేసులో ముగ్గురికి ఏడేళ్ల జైలు శిక్ష, చెరో రూ.3వేల జరిమానా విధిస్తూ అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి తీర్పు వెలువరించారు. అనంతపురంలోని వయోజన విద్య కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న (మృతుడు) ఈశ్వరయ్యను ఆయన వద్ద పనిచేస్తున్న సబార్డినేట్ ఉద్యోగులు, ప్రస్తుతం శిక్షపడిన ముగ్గురు చెప్పిన ఉద్యోగం చేయకుండా, మానసికంగా వేధించేవారు. వారి వేదనను తట్టుకోలేక ఈశ్వరయ్య 2015 ఫిబ్రవరి 2న ఉదయం 10గంటల సమయంలో తన ఆఫీస్‌లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతిచెందాడు. ఈశ్వరయ్య భార్య ఫిర్యాదు మేరకు అప్పటి వన్‌టౌన్ ఎస్ఐ రాంప్రసాద్ కేసు నమోదు చేశారు. అనంతరం సీఐ రాఘవన్ కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. అన్ని కోణాల్లో విచారించిన అనంతరం గురువారం అనంతపురం అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి నిర్మల.. నిందితులకు ఏడేళ్ల జైలు శిక్ష, చెరో రూ.3వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. పీపీలు వెంకట్రామిరెడ్డి, సాక్షులను సకాలంలో కోర్టులో హాజరు పరచిన వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్, కోర్టు మానిటరింగ్ సిస్టం సీఐ వెంకటేష్‌నాయక్, కోర్టు లైజన్ ఆఫీసర్ ఏఎస్ఐ శ్రీనివాసులు, కోర్టు హెడ్ కానిస్టేబుల్ షమీవుల్లా, వన్నూనప్పను జిల్లా ఎస్పీ జగదీష్ అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రానికి తాళం



వరండాలో భోజనం చేస్తున్న చిన్నారులు

పెద్దవడుగూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుర్నాకుంట గ్రామ అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేసిన ఘటన చోటుచేసుకుంది. 2013లో ఇదే గ్రామానికి చెందిన పక్కీరప్ప అనే వ్యక్తి అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి స్థలం ఉచితంగా ఇవ్వడంతోపాటు ఆ భవనాన్ని ప్రభుత్వ నిధులతో ఆయనే నిర్మించాడు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఆకుకూరలు పెంచడం కోసం పూలకుండీలను ఏర్పాటుచేయడంతో ఆ విషయం నచ్చని సదరు వ్యక్తి పూలకుండీలను తొలగిస్తారా లేకుంటే కేంద్రానికి తాళం వేస్తానని హెచ్చరించారు. దీనిని అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది పట్టించుకోకపోవడంతో కేంద్రానికి ఆ వ్యక్తి తాళం వేశారు. దీంతో చిన్నారులు వరండాలో భోజనం చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

కునుకుంట్ల కుంటకు నీరివ్వండి



మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తాడిమర్రి మండలం కునుకుంట్ల గ్రామంలో నీరు లేక నిర్జీవంగా మారిన కుంటకు పీబీసీ ద్వారా నీరు ఇవ్వాలని ఆ గ్రామస్థులు టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌ను కోరారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో గ్రామస్థులు శ్రీరామ్‌ను కలిశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ కొన్నేళ్లగా కుంటలో నీరు లేక భూగర్భజలాలు ఇంకిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. పీబీసీ కుడి కాలువ తాడిమర్రి మండలంలో ఉన్నప్పటికీ నీరు వచ్చేపరిస్థితి లేదన్నారు. ఈసారి ప్రాజెక్టుల్లో నీరు ఉన్న క్రమంలో కనీసం ఈ ఏడాదైనా కాలువకు నీరు ఇవ్వాలని రైతులు విజ్ఞప్తి చేశారు. దీనిపై శ్రీరామ్ స్పందిస్తూ కునుకుంట్లకు నీరు వచ్చే మార్గాలను ఆ గ్రామానికి వచ్చి పరిశీలిస్తామని, జలవనరుల శాఖ మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సంధా రాఘవ, తాడిమర్రి మండల కన్వీనర్ కూచి రామ్మోహన్ పాల్గొన్నారు. అనంతరం సభ్యత్వనమోదుపై పరిటాల శ్రీరామ్ సమావేశం నిర్వహించారు.

రిజిస్ట్రేషన్లకు.. రీ సర్వే కష్టాలు..!

● ఎల్‌పీఎం నిబంధనలతో తిప్పలు
● సగానికిపైగా తగ్గిన రిజిస్ట్రేషన్లు
● గత ప్రభుత్వ నిర్ణయాలతో అవస్థలు
● ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
● ఆరునెలలుగా అల్లాడుతున్న రైతులు



ధర్మవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ధర్మవరం/చెన్నేకొత్తపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎల్‌పీఎం (ల్యాండ్‌పార్సిల్ మేనేజ్‌మెంట్) విధానంతో భూములు, స్థలాల అమ్మకాల కొనుగోలుకు ఇబ్బందులు తప్పడం లేదు. అప్పటి ప్రభుత్వం శాశ్వత భూ హక్కు కల్పిస్తామని ఎంతో ఆర్భాటంగా చేపట్టిన భూ రీసర్వే రైతుల పాలిట గుదిబండగా మారింది. రీ సర్వేలో భాగంగా ఎల్‌పీఎంతో చాలా గ్రామాలకు సంబంధించి రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. భూములు రీసర్వే చేపట్టిన అనంతరం అధికారులు ఆయా సర్వే నెంబర్లకు ఎల్‌పీఎం నంబర్లు కేటాయించడంతో ఆ విధానమే రైతులకు శాపంగా మారింది. చాలా వరకు జాయింట్ ఎల్‌పీఎం కారణంగా భూముల సబ్ డివిజన్‌లు కాకపోవడంతో రిజిస్ట్రేషన్లు పూర్తిగా నిలిచిపోయి వాటి క్రయవిక్రయాలకు అవరోధంగా మారింది. దీంతో రైతులు దిక్కుతోచనిస్థితిలో పడ్డారు.

● ఆగిన రిజిస్ట్రేషన్లు

ధర్మవరం రెవెన్యూ డివిజన్‌లోని ధర్మవరం, చెన్నేకొత్తపల్లి సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిధిలో ఎల్‌పీఎం కారణంగా రిజిస్ట్రేషన్లు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో చాలా మంది రైతులకు అసలు విషయం తెలియక రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. భూ రీసర్వే కింద కేటాయించిన జాయింట్ ఎల్‌పీఎంతో అసలు సమస్య తలెత్తిందని తెలుసుకుని అవాక్కవుతున్నారు. దీని కారణంగా ఎల్‌పీఎం నంబర్లలో భూముల సబ్ డివిజన్లు కాక వెబ్ ల్యాండ్ ఓపెన్ కావడం లేదని తెలుసుకుని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ధర్మవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని గొట్లూరు, బత్తలపల్లి, అప్రాచెరువు, తాడిమర్రి గ్రామాలతో పాటు చెన్నేకొత్తపల్లి సబ్‌రిజిస్ట్రార్ కింద ఏల్కుంట్ల, ముత్తవకుంట్ల, నరసంపల్లి, గంతిమర్రి, చెన్నేకొత్తపల్లి, ప్యాదిండి గ్రామాలకు సంబంధించి రీ సర్వేనెంబర్లకు ఎల్‌పీఎం నంబర్లు కేటాయించడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాలలో భూముల క్రయవిక్రయాలకు ఆటంకం ఏర్పడటంతో ప్రభుత్వానికి ఆదాయం తగ్గిపోతోంది.

● ఆరు నెలలుగా అవస్థలు

గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఎల్‌పీఎం విధానంతో భూసమస్యలు పరిష్కారం కావడం లేదు. అప్పట్లో ఎంతో హడావుడి చేసిన అధికారులు తరువాత పట్టించుకోకపోవడంతో రైతులు రిజిస్ట్రేషన్లు జరగక నానా తిప్పలు పడుతున్నారు. చాలా గ్రామాలలో ఆరునెలల నుంచి రిజిస్ట్రేషన్లు నిలిచిపోయినట్టు తెలుస్తోంది. దిక్కుతోచని పరిస్థితులలో తమ సమస్యలను పరిష్కరించాలంటూ అధికారుల చుట్టూ రైతులు తిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

● రీ సర్వే విధానాన్ని రద్దు చేయాలి

రీ సర్వేతో రైతులకు లేనిపోని చిక్కులు తప్ప ఒరిగింది ఏమిలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎల్‌పీఎం విధానం రైతులకు గుదిబండగా మారింది తప్పా ఉపయోగం లేదనే వాదన లేకపోలేదు. దీంతో రీ సర్వే విధానాన్ని రద్దుచేయాలనే వాదన ప్రజల నుంచి వినిపిస్తోంది. ఈ విధానం వల్ల రైతుల భూములకు సంబంధించి సరైన రికార్డులు లేకుండా పోయాయని, కనీసం రిజిస్ట్రేషన్లు చేసుకుందామన్నా అందుకు అనుకూలంగా లేకుండాపోయిందని పలువురు వాపోతున్నారు.

రీ సర్వేతో అన్నీ కష్టాలే



భూ రీసర్వే వల్ల లేనిపోని ఇబ్బందులు తప్పా ఉపయోగం ఏమీలేదు. చెన్నేకొత్తపల్లిలో రీ సర్వే కింద ఎల్‌పీఎం నంబర్లతో భూముల రిజిస్ట్రేషన్లు కావడం లేదు. చాలా మంది రైతులకుఎక్కువ, తక్కువ విస్తీర్ణాలను చూపుతున్నారు. దీంతో భూ సమస్యలు తలెత్తున్నాయి. అధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలి.

- అమరేంద్రరెడ్డి, రైతు, చెన్నేకొత్తపల్లి

రిజిస్ట్రేషన్లు తగ్గినమాట వాస్తవమే

ఎల్‌పీఎం నంబర్ల కారణంగా భూములకు సంబంధించి సబ్‌డివిజన్‌లు కాకపోవడంతో వెబ్‌ల్యాండ్‌లు ఓపెన్ కావడంలేదు. దీంతో పలు గ్రామాలలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. అక్టోబరు నెలలో అయితే సగానికి సగం రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయి. దీంతో ఆదాయం భారీగా తగ్గింది.

- తాయన్న, శ్రీరామ్‌నాయక్, సబ్ రిజిస్ట్రార్లు, ధర్మవరం, చెన్నేకొత్తపల్లి

అభివృద్ధిలో పవన్‌కల్యాణ్ మార్క్ చూపుతాం

● అహుడా చైర్మన్ టీసీ వరుణ్
● నాయకులు, కార్యకర్తల ఘన స్వాగతం



గుత్తిరోడ్డు సర్కిల్లో గజమాలతో స్వాగతం పలుకుతున్న కూటమి నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా అభివృద్ధిలో క్రియాశీలక భూమిక పోషించే అహుడా సంస్థ అభివృద్ధిలో తమ అధినేత పవన్‌కల్యాణ్ మార్క్ ఏంటో చూపుతామని అహుడా చైర్మన్, జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ అన్నారు. అహుడా చైర్మన్ హోదాలో నగరానికి వచ్చిన ఆయనకు కూటమి నేతలు ఘన స్వాగతం పలికారు. బాటలో సుంకులమ్మ దేవలయం వద్ద ప్రత్యేక పూజల అనంతరం నగరంలోని గుత్తి రోడ్డు సర్కిల్‌కు చేరుకున్న వరుణ్‌కు నాయకులు, కార్యకర్తలు భారీ గజమాలతో స్వాగతం పలికారు. పాతూరు, శ్రీకంఠం సర్కిల్, టవర్ క్లాక్ వద్ద నాయకులు, కార్యకర్తలు అభిమానులు టపాసులు, పూలవర్షంతో ఆహ్వానించారు. టీసీ వరుణ్ మాట్లాడుతూ అహుడా సంస్థను అభివృద్ధిపథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతంచేసి ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానన్నారు. నగర అభివృద్ధి విషయంలో అందర్నీ సమన్వయం చేసుకొని ముందకెళ్తామన్నారు. కూటమి నేతల పరస్పర సహాయసహకారాలతో అభివృద్ధికి బాటలు వేస్తామని స్పష్టం చేశారు. అనంతరం నివాసానికి చేరుకున్న వరుణ్‌కు కుటుంబసభ్యులు స్వీట్లు తినిపించి ఆనందం పంచుకున్నారు.

ఓపీఎస్ పోరాటం ఆగదు

● మజ్దూర్ యూనియన్ జోనల్ కార్యదర్శి సీహెచ్ శంకర్రావు

గుంతకల్లు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఎన్‌పీఎస్ స్థానంలో తెచ్చిన యూపీఎస్ కొంత మెరుగైనదే అయినా, ఓపీఎస్‌ను సాధించే వరకూ మజ్దూర్ యూనియన్ విశ్రమించదని ఆ సంఘం జోనల్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్రావు అన్నారు. రైల్వే ఉద్యోగ సంఘ గుర్తింపు ఎన్నికల్లో భాగంగా శంకర్రావు ఆధ్వర్యంలో మజ్దూర్ యూనియన్ నాయకులు గురువారం ఉదయం వివిధ విభాగాలలో ప్రచారం నిర్వహించారు. రైల్వే కంట్రోల్ రూం, డీజిల్ షెడ్ తదితర శాఖల్లో యూనియన్‌కు ఓటు వేయాలని ప్రచారం చేశారు. శంకర్రావు మాట్లాడుతూ 8వ పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ)ని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను కాపాడే సంఘం మజ్దూర్ యూనియన్ అని అన్నారు. ఈ ఎన్నికల్లోనూ యూనియన్‌కు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఉద్యోగులను కోరారు. రాత్రి రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ప్రచార సదస్సును నిర్వహించారు. యూనియన్ జాయింట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు శ్రీనివాసులు, డివిజనల్ కార్యదర్శి విజయకుమార్, ఏడీఎస్ అశ్విని, నాయకులు మస్తాన్ వలి, జాఫర్ ఖాన్, ఎస్ఎం బాషా, సుధాకర్, రాజశేఖర్, మస్తాన్, రాజ, నతానియేల్ పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం వర్షం పడింది. అనంతపురం, రాప్తాడు, తాడిపత్రి, పుట్లూరు, బెలుగుప్ప, గుంతకల్లు, కూడేరు, శింగనమల, ఉరవకొండ, పామిడి, డి.హిరేహాళ్, నార్పల, గార్లదిన్నె, గుత్తి, విడపనకల్లు మండలాల్లో ఓ మోస్తారు వర్షం పడింది. బొమ్మనహాళ్, కళ్యాణదుర్గం, యాడికి తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

రానున్న మూడురోజుల్లో వర్ష సూచన

బుక్కరాయసముద్రం: ఉమ్మడి జిల్లాలో రానున్న మూడు రోజుల్లో వర్ష సూచన ఉన్నట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణ స్వామి తెలిపారు. పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు తెలిపారు. ఈశాన్య దిశగా గాలులు గంటకు 2-5 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉంది. వర్ష సూచన ఉన్న నేపథ్యంలో రైతులు పిచికారి పనులు వాతావరణ పరిస్థితిని గమనించి చేసుకోవాలన్నారు. నీటి వసతి ఉన్న రైతులు రబీ వేరుశనగ విత్తుకోవటానికి నవంబరు15 నుంచి డిసెంబరు 15 వరుకు అనుకూలమైన సమయమన్నారు.

స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కిరణ్మయి గురువారం ప్రకటనలో తెలిపారు. ఏపీ పీజీసెట్-2024లో అర్హత సాధించి డిగ్రీలో ఉత్తీర్ణులై ఇప్పటివరకు ఎక్కడా అడ్మిషన్ పొందని వారు అర్హులని పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్ అయ్యేవారికి ఫీజురీయింబర్స్‌మెంట్ రాదని ప్రవేశం పొందినరోజే ఫీజు మొత్తం చెల్లించాలని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు వారి ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో 16వ తేదీన అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌కు రావాలని కోరారు. వివరాలకు www.jntua.ac.in సందర్శించాలని సూచించారు.

అర్హులందరికీ పింఛన్ ఇవ్వాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తిరూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): 'గత వైసీపీ ప్రభుత్వం టీడీపీ మద్దతుదారులంటూ వేలాది మంది అర్హులకు పింఛన్లు రాకుండా చేసింది. అంతేకాకుండా ఆ పార్టీ మద్దతుదారులైన మూడు లక్షల మంది అనర్హులకు పింఛన్లు మంజూరు చేసింది. వెరిఫికేషన్ చేసి ఆ అనర్హులను తొలగించి.. అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్ మంజూరు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలి' అని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం అమరావతిలో నిర్వహించిన శాసనసభ సమావేశాల్లో ఆమె సంబంధిత మంత్రి కొండపల్లి సురేష్‌కు విజ్ఞప్తి చేశారు. 50 ఏళ్లకు పైబడిన వారందరికీ పింఛన్ హామీని ఎప్పటి నుంచి అమలు చేస్తారో ఒక నిర్దిష్టమైన సమయాన్ని ప్రకటించాలని కోరారు. దివ్యాంగులు సదరం క్యాంపునకు వెళ్లి ధ్రువపత్రం పొందడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అటువంటి వారికి ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేకంగా ఒక సదరం క్యాంపును ఏర్పాటు చేయాలని సంబంధిత మంత్రి శ్రీనివాస్‌ను కోరారు.

సత్యసాయి జయంతికి గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్జే రత్నాకర్

పుట్టపర్తిరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయి బాబా శత జయంత్యుత్సవాలకు రావాల్సిందిగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్‌కు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ ఆహ్వానం పలికారు. గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన ఆయన.. ఈ నెల 23న ప్రశాంతినిలయంలో జరిగే బాబా జయంతి వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లుగా నలుగురికి చోటు

అనంతపురం అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి, బోయ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లుగా జిల్లాకు చెందిన నలుగురికి చోటు దక్కింది. ఈ మేరకు టీడీపీ అధిష్ఠానం గురువారం రాత్రి జాబితాను విడుదల చేసింది. శింగనమల నియోజకవర్గానికి చెందిన కుళ్లాయప్ప, జనసేన నాయకుడు అంకె ఈశ్వరయ్య, అనంతపురం అర్బన్ నియోజకవర్గం లక్ష్మీనరసింహమూర్తి, కళ్యాణదుర్గం రమేష్‌బాబును రాష్ట్ర డైరెక్టర్లుగా నియమించారు.

చట్టాలపై అవగాహన అవసరం

అనంతపురం క్రైం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ అన్నారు. గురువారం కేఎస్ఎన్ ప్రభుత్వ పాఠశాలలో బాలల చట్టాలపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. చట్టపరమైన సమస్యలకు వివరాలను సందేశాత్మకంగా, వివరణాత్మకంగా న్యాయాధికారి వివరించారు. విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు, న్యాయవాది హరికృష్ణ, ప్రధానోపాధ్యాయుడు అంజనేయులు పాల్గొన్నారు.

18 ఏళ్లు పైబడిన వారికి క్యాన్సర్ పరీక్షలు

శింగనమల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 18 సంవత్సరాలు పైబడిన వారికి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబీ దేవి తెలిపారు. మండలంలోని కల్లుమడి గ్రామంలో గురువారం ఇంటింటి క్యాన్సర్ పోస్టర్లను ఆమె విడుదల చేశారు. అనంతరం వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో వైద్యసిబ్బంది ఇంటింటా తిరిగి 18 ఏళ్ల నిండిన వారికి క్యాన్సర్ ఉచిత పరీక్షలు చేయాలని ఆదేశించారు. నోరు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌తో పాటు దీర్ఘకాలిక వ్యాధులపై సమాచారం సేకరించి వైద్యం అందించాలన్నారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి, తరిమెల వైద్యాధికారి శంకర్‌నాయక్, తేజస్విని, గాంగధర్ ఆశ్వర్థ, దివ్యభారతి, తిరుపాలమ్మ పాల్గొన్నారు.

పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రులదే కీలక పాత్ర

● ఎస్పీ జగదీష్ దంపతులు



ఎస్పీ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపాధ్యాయులు

అనంతపురం క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రులదే కీలక పాత్ర అని ఎస్పీ జగదీష్ దంపతులు అన్నారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని పోలీస్ కాన్ఫరెన్స్ రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూలు పిల్లల మధ్య ఘనంగా బాలల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎస్పీ దంపతులు హాజరై మాట్లాడారు. పిల్లల భవిష్యత్తు నిర్దేశంలో తల్లిదండ్రుల పాత్ర చాలా ఉందన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో పోలీసు పిల్లలు ఫస్ట్‌క్లాస్ చదువుకునేలా అనుమతుల కోసం దరఖాస్తు చేశామన్నారు. స్పానిష్ టీచర్ కోసం ఆర్టీటీ వారికి లేఖ రాశామని, పిల్లలకు చదువుతో పాటు ఆటలు, డ్యాన్స్, ఇతర అభివృద్ధికి కృషి చేస్తామని పిలుపునిచ్చారు. అనంతరం పిల్లలకు బిస్కెట్స్, పెన్నులు తదితర సామగ్రిని అందజేశారు. పిల్లలు బృందంగా ఏర్పడి రోడ్డు ప్రమాదాల నియంత్రణ, రోడ్డు భద్రతా నియమాల పాటింపుపై చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహిస్తున్న రక్షక్ ప్రీ ప్రైమరీ స్కూలు పిల్లల కోసం సిద్ధం చేసిన గదిని ఎస్పీ సతీమణి హేమ ప్రారంభించారు. అదనపు ఎస్పీలు రమణమూర్తి, ఇలియాజ్‌బాషా, సీఐలు ధరణికిషోర్, క్రాంతికుమార్, దేవానంద్, ఆర్ఐలు రెడ్డప్పరెడ్డి, మధు పాల్గొన్నారు.

జూనియర్ అథ్లెటిక్స్‌లో విద్యార్థినికి గోల్డ్ మెడల్



సుదీక్షను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఉరవకొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాకెట్ల గ్రామానికి సుదీక్ష జూ నియర్ అథ్లెటిక్స్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. బెంగళూరులో ఎంబీఏ చదు వుతున్న ఈమె గత నెల 13వ తేదీన చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన సౌత్ ఏషియన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలో పాల్గొని పరుగు పందెంలో గోల్డ్ మెడల్ సాధించింది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులు, గ్రామస్థులు సన్మానించారు. ఇన్‌చార్జి హెచ్ఎం వెంకటస్వామి పాల్గొన్నారు.

జియో ట్యాగింగ్ ప్రగతిపై డీపీఓ అసంతృప్తి

● కార్యదర్శుల్లో మార్పు రాకుంటే చర్యలు: డీపీఓ



సిబ్బందితో చర్చిస్తున్న డీపీఓ నాగరాజనాయుడు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇంటింటి జియోట్యాగింగ్ ప్రగతిపై డీపీఓ నాగరాజ నాయుడు అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం ఆయన రూరల్ మండలం కక్కలపల్లి పంచాయతీలో తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది చేపట్టిన ఎన్‌సీసీఐ, ఇంటింటి జియో ట్యాగింగ్ నమోదును ఆయన తనిఖీ చేశారు. సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది కార్యాలయంలో వారి బయోమెట్రిక్ నమోదు చేసుకొని ఫీల్డ్‌కు వెళ్లి జియోట్యాగింగ్‌లో ప్రగతి కనిపించేలా చూడాలన్నారు. మీలో మార్పు రాకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. రుద్రంపేట పంచాయతీ శ్రీనగర్ కాలనీలో స్థానికులు పలు సమస్యలను డీపీఓ దృష్టికి తీసుకువచ్చారు. తాగునీరు, వీధిదీపాల సమస్యను వెంటనే పరిష్కరించేలా చూడాలని కార్యదర్శిని ఆదేశించారు.

విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దు: జనన ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దని డీపీఓ నాగరాజనాయుడు కార్యదర్శులకు సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న విద్యార్థుల వివరాల నమోదులో జనన ధ్రువీకరణ పత్రం అవసరమని ఇందుకోసం వచ్చేవారికి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణం జారీ చేయాలని ఆదేశించారు. దీనిపై కార్యదర్శులకు సర్క్యుల్ కూడా జారీ చేశామన్నారు.

గిరిజన పంచాయతీల్లో గ్రామసభలు: జిల్లాలో కేంద్ర ప్రభుత్వం నుంచి నోటిఫై చేసిన గిరిజన పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు డీపీఓ నాగరాజనాయుడు తెలిపారు. గిరిజన ఉద్యమకారుడు బిరిషముండా 150వ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. గుంతకల్లు మండలంలోని గుండాల తండా, వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లి తండా, శింగనమల మండలంలోని చిన్నవరం తండా పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు.

ఆంధ్రజ్యోతి సండే క్లాసిఫైడ్స్ SUNDAY CLASSIFIEDS

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647

AJA-198467

కావలెను

శక్తి మైత్రి మహిళా సంఘం APSACS TI ప్రాజెక్ట్ ధర్మవరం నందు పని చేయుటకు ANM కావలెను. విద్యార్హత: ANM/GNM మరియు HIV లో ఒక సం॥ అనుభవం కలిగి ఉండాలి. మీ యొక్క Resume ని shakthimms.dmm@gmail.com కి మెయిల్ చేయగలరు. Ph:9440849571

AJA-SREE

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

సంక్షిప్తం

అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

● ఏడీఏ లక్ష్మణ్‌నాయక్

గార్లదిన్నె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఏ లక్ష్మణ్‌నాయక్ హెచ్చరించారు. జిల్లా వ్యవసాయాధికారి ఆదేశాల మేరకు రాయదుర్గం ఏడీఏ లక్ష్మణ్ నాయక్ గురువారం గార్లదిన్నెలో పలు ఎరువుల దుకాణాలను ఏఓ సోమశేఖర్‌తో కలసి తనిఖీ చేశారు.

● నార్పల మండలంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి చన్నవీరస్వామి, కల్యాణదుర్గం వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్లప్ప ఆధ్వర్యంలో గురువారం తనిఖీ చేశారు.

టమోటా కిలో రూ.23

అనంతపురం రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 1050 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.18, కనిష్ఠ ధర రూ.11 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ కాయలు టన్ను రూ.32వేలు

స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.32వేలు పలికినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.12వేలు, సరాసరి రూ.24,100తో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 60 టన్నుల కాయలు వచ్చాయన్నారు.

'యూరియా గోల్డ్ వాడితే ప్రయోజనం'

అనంతపురం అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లోకి కొత్తగా ప్రవేశ పెట్టిన యూరియా గోల్డ్ ఎరువులు వాడితే ప్రయోజనాలు ఉంటాయని అనంతపురం ఏడీఏ రవి పేర్కొన్నారు. గురువారం జిల్లాకు చేరిన యూరియా గోల్డ్ ఎరువుల బస్తాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 40 కేజీల బస్తా రూ.266గా నిర్ణయించారన్నారు. సల్ఫర్ లోటు కలిగిన నేలలకు బాగా ఉపయోగకరమన్నారు.

ఇద్దరు ఎంపీడీఓలకు షోకాజ్?

అనంతపురం విద్య, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇద్దరు ఎంపీడీఓలకు జడ్పీ ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. బొమ్మనహాల్ ఎంపీడీఓ దాసా నాయక్, వజ్రకరూరు ఎంపీడీఓ రవిప్రసాద్‌కు నోటీసులిచ్చినట్టు జడ్పీ వర్గాల ద్వారా తెలిసింది. ప్రభుత్వ పథకాల అమలులో వెనుకబడటంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ ఇద్దరికి నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. దీనిపై వివరణ కోసం గురువారం జిల్లాపరిషత్ సీఈఓ వెంకటసుబ్బయ్యకు ఫోన్ చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.

కాలువ పూడ్చివేతపై చర్యలు తీసుకోండి

గార్లదిన్నె, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సాగునీరు సరఫరా అయ్యే కాలువను పూడ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని కోటంక గ్రామస్థులు డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునకు విన్న వించారు. వారు గురువారం సీపీఎం నాయ కులతో కలిసి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. కూడేరు మండలం పొట్టి చెరువు నుంచి కోటంక గ్రామానికి సాగు నీరు సరఫరా అయ్యే కాలువను కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం పూడ్చారన్నారు. డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నాగరాజు, మండలాధ్యక్షుడు చెన్నారెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

అనంతపురం రూరల్, శింగనమల, రాప్తాడు నియోజకవర్గాల్లో గ్రంథాలయాల్లో గురువారం 57వ గ్రంథాలయ వారోత్సవాలను, బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాల అధికారులు, ఎంఈఓలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

ఆత్మకూరు, నవంబరు14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుహోబిలం లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వద్ద నీటి ట్యాంకు నిర్మాణానికి టీడీపీ మండల ఇన్‌చార్జ్ బాలజీ గురువారం భూమిపూజ చేశారు. నీటి ట్యాంకు నిర్మాణానికి రూ.10లక్షలు మంజురయ్యాయి. ఈకార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మానాయక్ ఎంపిడిఓ లక్ష్మీనరసింహ ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శివకుమార్, హరి టీడీపీ నాయకులు శశాంక్ చౌదరి తదిరులు పాల్గొన్నారు..

కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకురావాలి

అనంతపురం క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు బెంచ్‌ను కర్నూలులో ఏర్పాటు చేయాలని అనంతపురం బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ క్రమంలో ఈ నెల 20వ తేదీ నుంచి 23వరకు కోర్టు విధులు బహిష్కరిస్తున్నట్లు స్పష్టం చేసింది. గురువారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడారు.

చెత్త బుట్టలో మృత శిశువు

అప్పుడే పుట్టిన ఓ ఆడ శిశువు మృతదేహం గురువారం ఉదయం నగరంలోని అరవిందనగర్‌లోని పార్కు సమీపంలో చెత్తబుట్టలో కనిపించింది. ఎవరో ఆ శివువును అక్కడ విడిచి వెళ్లారు. టూటౌన్ పోలీసులకు స్థానికులు సమాచారం అందించడంతో మృత శిశువను తీసుకెళ్లి ఖననం చేయించారు.

ఆగిన ఉపాధి పనులు

● మూడు నెలలుగా నిలిచిపోయిన వైనం
● పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



నార్పల ఎండీపీఓ కార్యాలయం

నార్పల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వలసల నివారణ కోసం 2006, ఫిబ్రవరి 2న దేశంలోనే ఎక్కడ లేని విధంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కరువు సీమలో ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించారు. నార్పల మండలం బండ్లపల్లిలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ చేతుల మీదుగా ఎంతో అట్టహాసంగా ప్రారంభించారు. అయితే మండలంలోని ప్రస్తుత పరిస్థితులు ఆ ఉపాధి పథకం పనులు కల్పించలేకుండా ఉన్నాయి. మండలంలో 17గ్రామ పంచాయతీలకు 17 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించారు. అయితే వారంతా వైసీపీకి మద్దతుగా ఉన్న వారినే ఆరోపణలు ఉన్నాయి. దీంతో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ 17మంది స్థానంలో కొత్తవారిని నియమించాలని అధికారులపై ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న 17 మంది కూడా కూలీలకు పనులు కల్పించకుండా ఉండిపోయారు. వీరిలో నార్పల, గంగనపల్లి, సోదనపల్లిల్లో అప్పుడప్పుడు మాత్రమే మేట్ల ద్వారా పనులు కల్పిస్తున్నారు. ఇదిలా ఉండగా ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపు విషయంలో గ్రామీణ స్థాయి గ్రూప్ రాజకీయాలు మొదలైనట్లు తెలుస్తోంది. తమవారికే ఫీల్డ్ అసిస్టెంట్లు కావాలని నాయకులు అధికా రులతో తీవ్రస్థాయిలో వాగ్వివాదానికి దిగారు. మరికొందరు గ్రూప్ రాజకీయాలకు తెరలేపి మండల స్థాయి అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు పలు చోట్ల అడపాదడపా చేపట్టిన పనులను నిలిపి వేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల మార్పు ఇప్పటికి ఓ కొలిక్కి రాకపోవడంతో ఉపాధి పనులు నిలిపివేశారని మండలంలో చర్చించుకుంటున్నారు. గ్రామీణ గ్రూపు రాజకీయాలను సము దాయించలేని పరిస్థితి అధికారుల్లో నెలకొన్నట్లు సమా చారం. దీంతో కొత్త ఫీల్డ్ అసిస్టెంట్లను నియమిం చలేక, కూలీలకు పనులు కల్పించలేకపోతున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా మూడు నెలలుగా ఉపాధి పనులు లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నా మని మండలంలోని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మండలంలోని రంగాపురం, సిద్దిరాచెర్ల, దిగుమర్రి, నాయినపల్లి, బండ్లపల్లి, నడిమిదొడ్డి, గడ్డంనాగేపల్లి, హెచ్‌కోధనపల్లి, తదితర గ్రామ పంచాయతీలో మూడు నెలలుగా ఉపాధి హామీ పనులు పూర్తిగా నిలిచిపోయాయి.

పట్టించుకోలేదు..



తమ గ్రామంలో కరువు పనులు పెట్టమని ఫీల్డ్‌అసిస్టెంట్‌ను అడిగాం. ఇప్పుడు నాకు సంబంధం లేదని, అధికారులు చెబితేనే పనులు పెడతామని చెబుతున్నాడు. ఏవరిని అడగాలో తెలియక తమ గ్రామంలోనే వ్యవసాయ కూలీ పనులకు వెళ్తున్నాని ఆమె తెలిపింది.

- గాయత్రి, బండ్లపల్లి

పనుల్లేక ఇంటి వద్ద ఉన్నాం



మా గ్రామంలో ఉపాధి హామీ పనులను నిలిపి వేసి మూడు నెలలు అయింది. వ్యవసాయ కూలీ పనులకు ఆడవాళ్లనే ఎక్కువగా పిలుస్తారు. మగవారిని తక్కువగా పిలుస్తారు. మరో వైపు ఉపాధి పనులు లేక ఇంటివద్ద ఉన్నాం. పనులు కల్పించాలని అధికారులను ఫోన్ ద్వారా అడిగితే కొద్ది రోజులు ఆగాలని ఫోన్ కట్ చేస్తున్నారు.

- బాలయ్య, బండ్లపల్లి

ఫీల్డ్‌అసిస్టెంట్ల నియామకం కాకనే...

నార్పల మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం గురించి గ్రామీణ ప్రజలు సమస్యలు తీసుకొస్తున్నారు. దీంతో పనులు నిలిపివేశాం. అక్కడక్కడ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే అన్ని గ్రామ పంచాయతీలో పనులు కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

- గంగావతి, ఎంపీడీఓ

నగరంలో భారీ వర్షం


సప్తగిరి సర్కిల్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు.. వాహనదారుల ఇబ్బందులు

అనంతపురం అర్బన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరంలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సుమారు అరగంటపాటు కురిసిన కుండపోత వర్షానికి రహదారులపై భారీగా నీరు నిలిచింది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలకు వర్షపు నీరు చేరడంతో జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరో మూడు రోజులపాటు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.


క్లాక్ టవర్ సమీపంలో నిలిచిన వర్షపు నీరు

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి

అనంతపురం కల్చరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు చేపట్టిన ప్రజాపోరు యాత్రలో సీపీఎం దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి డిమాండ్ చేశారు. సీపీఎం ప్రజాపోరు యాత్ర ముగింపు సందర్భంగా గురువారం ఆర్డీఓ కార్యాలయం ముందు సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఎం నాయకులు వెంకటనారాయణ, ఇర్ఫాన్ సంయుక్త అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి సావిత్రి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శులు రామిరెడ్డి, ఆర్వీ నాయుడు, నాయకులు గోపాల్, ఏటీఎం నాగరాజు, ప్రకాష్, వలి, మసూద్, ఐద్వా నాయకురాళ్లు చంద్రిక, శంషాద్, డీవైఎఫ్ఐ నాయకులు బాలు, కేవీపీఎస్ నాయకులు వెంకటేష్, జీవా, ప్రజానాట్యమండలి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత : ఎస్ఈ

అనంతపురం రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ పొదుపులో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉండాలని విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఉర్జావీర్ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉర్జావీర్ పథకం ద్వారా ఈఈఎస్ఎల్ ఫైవ్ స్టార్స్ బల్బ్స్, ట్యూబ్‌లైట్స్, ఫ్యాన్స్, ఇండక్షన్ స్టౌవ్ ఫైవ్‌స్టార్ ఏసీలు వారంటీతో పాటు అందుబాటులోకి తెస్తున్నారన్నారు. ఈఈలు ప్రసాద్, రమేష్, రామకృష్ణ, రాజశేఖర్, టౌన్-1,2 డీఈఈలు చంద్రశేఖర్, శ్రీనివాసులు, విద్యుత్ తనిఖీ అధికారి అజయబాబు, నోడల్ అధికారి యామిని, ఈఈఎస్ఎల్ జిల్లా కో ఆర్డినేటర్ జగదీష్‌కుమార్, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టింబక్టు కలెక్టివ్ వార్షికోత్సవం

చెన్నేకొత్తపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థను స్థాపించి 35 సంవత్సరాల ప్రస్థానంలో సంస్థ వ్యవస్థాపకులు మేరి వటమట్టం, బబ్లూగంగూలి కృషి అమోఘమైందని పలువురు వక్తలు పేర్కొన్నారు. చెన్నేకొత్తపల్లిలోని చింతవనం కార్యాలయ ఆవరణంలో గురువారం సంస్థ 35వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జనజాగృతి సంస్థ, రెడ్స్, రైడ్స్ సంస్థల ప్రతినిధులు బలరాం, శ్రీమతి బానుజ, కిష్టప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సంస్థ వ్యవస్థాపకులు బబ్లూగంగూలి, అసిస్టెంట్ డైరెక్టర్ సుకన్య శాకమూరి మాట్లాడుతూ... రాబోవు పదేళ్లలో అందరి సహకారంతో మరిన్ని కార్యక్రమాలు చేపడుతామన్నారు. సిబ్బంది, పిల్లలు సాంస్కృతిక కార్యక్రమాలుఆకట్టుకున్నాయి.

పోసాని కృష్ణమురళిపై కేసు నమోదు

అనంతపురం క్రైం, నవంబరు 14 : సినీనటుడు పోసాని కృష్ణ మురళిపై అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అనంతపురం నగరం కళ్యాణదుర్గం రోడ్డులో నివాసముంటున్న టీడీపీ కార్మిక విభాగం టీఎస్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు మకర నాగరాజు బుధవారం జిల్లా ఎస్పీ జగదీష్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడును పోసాని చెప్పలేని భాషలో దూషించారని, అసభ్య పదజాలంతో మాట్లాడిన పోసానిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ ఫిర్యాదు ఆధారంగా గురువారం అనంతపురం రూరల్ పోలీసులు పోసానిపై కేసు నమోదు చేశారు.

సోషల్ మీడియా సైకోల వెనుక జగన్

● పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు

అనంతపురం అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియా సైకోల వెనుక మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాత్ర ఉందని పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు ఆరోపించారు. ఆయన గురువారం స్థానిక అర్బన్ టీడీపీ కార్యాలయంలో రజక, నాయీబ్రాహ్మణ, కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు పరమేశ్వరన్, కడియాల కొండన్నతో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం సోషల్ మీడియా సైకోలపై యుద్ధం జరుగుతోందన్నారు. మహిళా రాజకీయ నాయకులను, కొందరు నేతల కుటుంబ సభ్యులపై సభ్య సమాజం తలదించుకునేలా వైసీపీ సోషల్ మీడియా సైకోలు పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు. ఈ విషయాన్ని నగర మేయర్ వసీం తెలుసుకోవాలని హితవు పలికారు.

డీఎస్‌డీఓగా ఉదయ్‌భాస్కర్ బాధ్యతల స్వీకరణ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారిగా (డీఎస్‌డీఓ)గా ఉదయ్‌భాస్కర్ బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు డీఎస్‌డీఓగా ఉన్న షేక్ షఫీపై అవినీతి, అక్రమాల నేపథ్యంలో సస్పెన్షన్ వేటు వేసిన ప్రభుత్వం... శ్రీసత్యసాయి జిల్లా డీఎస్‌డీఓగా ఉన్న ఉదయ్ భాస్కర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన గురువారం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

డిప్యూటీ స్పీకర్‌కు మహిళా ప్రజాప్రతినిధుల శుభాకాంక్షలు


డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజుతో మహిళా ప్రజాప్రతినిధులు

అనంతపురం అర్బన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికైన రఘురామకృష్ణంరాజుకు ఉమ్మడి అనంత జిల్లాకు చెందిన మహిళా ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం అసెంబ్లీలో ఆయనకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, బండారు శ్రావణిశ్రీ, సింధూరరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సమస్యలపై సరైన చర్చ జరిగేలా చూడాలని వారు కోరారు.

'మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలి'



నాట్యాచార్యురాలు దేవరకొండ కౌసల్య, శిష్య బృందాన్ని సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సేవకులు సమాజానికి ఉపయోగపడేలా మరిన్ని సేవాకార్యక్రమాలు చేపట్టాలని టీడీపీ నాయకుడు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. రాయచోటిలో బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో స్వచ్ఛందంగా సేవలందిస్తున్న పలువురికి జ్ఞాపికల ప్రదానం చేశారు. అనంతపురం నగరానికి సంబంధించి గోసేవ కార్యక్రమాలు చేపడుతున్న డాక్టర్ దేవరకొండ కౌసల్యకు మదర్ థెరిస్సా అవార్డు అందజేసి సత్కరించారు. అలాగే ఓం సంగీత నృత్యశిక్షణాలయం చిన్నారులు సమృద్ధి, కుందనిక, దీపిక, అర్చన, లాస్యప్రియ, చెరితశ్రీ, శిరీష, తేజీవతి, అనురాధమ్మ, రాగిణి, ఆనందమ్మ, ఈశ్వరిలకు నాట్యమయూరి అవార్డులను సోమలరాజు ఫౌండేషన్ ఛైర్మన్ శివరాజు చేతులమీదుగా అందజేసి సత్కరించారు.

ప్రభుత్వాల చొరవతో సహకారానికి జవసత్వాలు

● అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జేఎల్ మురళీధర్


సహకార జెండా ఎగురవేస్తున్న ఛైర్మన్ జేఎల్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకార వ్యవస్థకు జవసత్వాలు నింపుతున్నాయని... దీంతో సొసైటీలకు పూర్వ వైభవం తీసుకొస్తున్నాయని ది అనంతపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జేఎల్ మురళీధర్ పేర్కొన్నారు. స్థానిక సుభాష్ రోడ్డులోని శ్రీకృష్ణదేవరాయభవన్‌లో గురువారం ఆయన సహకార జెండాను ఆవిష్కరించి, 71వ అఖిల భారత జాతీయ సహకార వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ దేశ మొట్ట మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సహకార వ్యవస్థకు చేయూతనిచ్చి, గ్రామీణ ప్రాంతాల్లో పేదలు, రైతులకు అండగా నిలిచారని గుర్తుచేసుకున్నారు. ఇందుకు స్ఫూర్తిగా నెహ్రూ జయంతి రోజున సహకార వారోత్సవాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వారోత్సవాలలో భాగంగా ఆదివారం ఆర్డీటీ స్టేడియంలో ఉద్యోగుల క్రికెట్ పోటీలు, 19న అర్బన్ బ్యాంకులో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు వైస్‌ఛైర్మన్ వెంకటాద్రి, పాలకవర్గసభ్యులు కృష్ణకుమార్, సుంకర రమేష్, మాగిశెట్టి చంద్రశేఖర్, రొళ్ల భాస్కర్, చింతా భాస్కర్, సీఈఓ విజయభాస్కర్, ఖాతాదారులు, ఉద్యో గులు తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని రామ్‌నగర్‌లో ఉన్న రాయలసీమ సహకార శిక్షణ కేంద్రంలో సీనియర్ డిప్యూటీ రిజిస్ట్రార్ నారాయణ స్వామి చేతుల మీదుగా సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. అర్బన్‌బ్యాంకు ఛైర్మన్ జేఎల్ మురళీధర్ ముఖ్య అతిథిగా హాజరై సహకార వారోత్సవాల ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీటీసీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

తొలి ప్రధాన్ని జవహర్‌లాల్ జయంతి సందర్భంగా గురువారం వివిధ పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెహ్రూ జీవిత విశేషాలను చిన్నారులకు వివరించారు. అనంతరం చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. నగరంలోని అన్ని పాఠశాలల్లో బాలలదినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు.


నగరంలోని మాంటిస్సోరి స్కూల్‌లో వేడుకలు


మినర్వా స్కూల్‌లో...


షిరిడిసాయి మోక్షిత స్కూల్‌లో...


విన్సెంట్ డీపాల్ స్కూల్‌లో....


భారత్ విద్యానికేతన్ స్కూల్‌లో...


ఎస్‌పీఎల్ఎన్ఎస్ గురుకుల పాఠశాలలో..


రామకృష్ణా విద్యామందిర్‌లో...


సాయి విజ్ఞాన్ స్కూల్‌లో..


నవభారత్ స్కూల్‌లో నృత్యాలు చేస్తున్న చిన్నారులు


రెయిన్‌బో హోంలో విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న దృశ్యం


ఎరా ఇంటర్నేషనల్ స్కూల్‌లో....


నసనకోట గురుకుల పాఠశాలలో...

భావి శాస్త్రవేత్తలు కావాలి: అనంతరాముడు


విద్యార్థులకు బహుమతులందజేస్తున్న అనంతరాముడు

అనంతపురం సెంట్రల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : నేటి బాలులే రేపటి పౌరులని, వారు భవిష్యత్ శాస్త్రవేత్తలై దేశ ఖ్యాతిని చాటాలని అనంత లక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్ ఛైర్మన్ అనంతరాముడు పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సదర్భంగా నిర్వహించిన సాంస్కృతిక, క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అనంతరాముడు, వైస్ ఛైర్మన్ రమేష్‌నాయుడు బహుమతు లందజేశారు. కార్యక్రమంలో సీఓఏ నరసింహారావు, ఉపాధ్యాలు పాల్గొన్నారు. అలాగే జేఎన్‌టీయూలోలాల్ నెహ్రూజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య హాజరై నెహ్రూచిత్రపటానికి నివాళులర్పిచారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయంలో నెహ్రూ జయంతి

అనంతపురం న్యూటౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాల యంలో గురువారం తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ అర్బన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దాదాగాంధీ ఆధ్వర్యంలో నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. పార్టీ నాయకులు వాసు, సురేష్, ఇంతియాజ్, కృష్ణ, పరమేశ్వరరెడ్డి, అల్లాబకాష్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

ఆకాశదీపోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

తాడిపత్రి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించే ఆకాశదీపోత్సవానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. తెల్లవారుజామున 3గంటలకు గండా దీపోత్సవం, స్వామివారికి క్షీరాభిషేకం, సాయంత్రం 6గంటలకు ఆకాశదీపోత్సవం, 7గంటలకు బాణాసంచా వేడుకలు, 7:30గంటలకు జ్వాలాతోరణం, 8గంటలకు నెల్లూరు బృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

తూతూ మంత్రంగా మండల సమావేశం

విడపనకల్లు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. ఎంపీపీ కరుణం పుష్పావతి అధ్యక్షతన, ఎంపీడీఓ షకీలా బేగం ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఉదయం 11:30 ప్రారంభం అయిన సర్వ సభ్య సమావేశాన్ని మధ్యాహ్నం 1:30కే ముగించారు. కేవలం 2 గంటలకే పూర్తి చేశారు. గ్రామాల్లోని ఏ ఒక్క సమస్యను సభ్యులు సమావేశంలో ప్రస్తావించలేదు. పలు శాఖల అధికారులు మాత్రం వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు హనుమంతు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అధికారులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

గుంతకల్లు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 32వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం టీడీపీ నాయకుడు నారాయణ స్వామి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ. 10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డును నిర్మించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్, టీడీపీ నాయకులు బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, కౌన్సిలర్లు షైమున్నిసా బేగం, ప్రభాకర్, వై సుధాకర్, విద్యారాణి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

పెద్దవడుగూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశేపల్లి గ్రామానికి చెందిన యువకుడు సునీల్‌కుమార్‌రెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సునీల్‌కుమార్‌రెడ్డి గురువారం మిడుతూరు గ్రామసమీపంలోని వ్యవసాయ పొలంలో పురుగుమందు తాగి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. అటుగా వెళుతున్న రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా అతను అప్పటికే మృతిచెందాడు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

రెండు దుకాణాల్లో చోరీ

తాడిపత్రి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడప రోడ్డులో ఉన్న జేసీబీ స్పేర్ పార్ట్స్, సిమెంట్ దుకాణాల్లో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగిందని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. జేసీబీ స్పేర్‌పార్ట్స్ దుకాణంలో రూ.50వేలు, సిమెంట్ దుకాణంలో రూ.1800 నగదు చోరీకి గురైనట్లు చెప్పారు. అలాగే ఓ డాబాలో కూడా చోరీ జరిగిందన్నారు. ప్రతిషాపు యజమాని షాపు మూసివేసేటప్పుడు కౌంటర్‌లో డబ్బు ఉంచరాదని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అదేవిధంగా ప్రతిషాపువద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

ఇద్దరిపై 420 కేసు నమోదు

తాడిపత్రి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగాదేవిపల్లి గ్రామానికి చెందిన పెద్దయ్య, రాజులపై 420కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. చిన్నపొలమడ గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్‌తో పెద్దయ్య, రాజు ఆరేళ్లక్రితం ట్రాన్స్‌కోలో ఉద్యోగం ఇప్పిస్తామని రూ.6లక్షలు తీసుకున్నారు. అయితే ఇంతవరకు ఉద్యోగం ఇప్పించకుండా అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. డబ్బులు అడిగితే పలకకుండా, ఫోన్‌చేస్తే ఎత్తకుండా ఉండడంతో బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ ఫిర్యాదు మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక రీచ్ తనిఖీ

కణేకల్లు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చుమర్రి వద్ద గల ఇసుక రీచ్‌ను ఆర్డీఓ వసంతబాబు గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇసుక రీచ్‌ను ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా సక్రమంగా నిర్వాహణ చేయాలని తహసీల్దార్ ఫణికుమార్‌కు సూచించారు. అనంతరం రీచ్‌కు సంబంధించి పూర్తి వివరాలను వీఆర్వో ద్వారా తెలుసుకున్నారు. సర్పంచు రుద్రముని పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కళ్యాణదుర్గం రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు గురువారం దాడులు చేసి పట్టుకున్నారు. బ్రహ్మసముద్రం పరిసర ప్రాంతాలలో కర్ణాటక నుంచి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో వేరు వేరు చోట్ల ముగ్గురు వ్యక్తుల నుండి 143 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుభాషిణి, అనంతపురం సీఐ జయనాథ్ రెడ్డి, కళ్యాణదుర్గం ఎక్సైజ్ సీఐ హసీనాభాను, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

కూడేరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడదరకుంట గ్రామంలో గురువారం ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠ ను వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున వేదపండితులు వేద మంత్రాల నడుమ ధ్వజస్తంభం, బొడ్డురాయి ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద తరలివచ్చారు.



తాడిపత్రిలో విజేతను అభినందిస్తున్న జేసీ ప్రభాకర్ రెడ్డి



కంబదూరులోని శారదా విద్యా విహార్‌లో బాలల దినోత్సవాన్ని జరుపుకుంటున్న దృశ్యం



కూడేరులోని వాణి స్కూల్లో విద్యార్థిని అభినందిస్తున్న సీఐ శివరాముడు



ఉరవకొండ సెంట్రల్ ఎంపీ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ఘనంగా బాలల దినోత్సవం

● పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు ఘన నివాళి

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ జయంతిని పురస్కరించుకుని గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజవకర్గాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో వేడుకలను జరిపారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. నెహ్రూ దేశానికి చేసిన సేవల్ని కొనియాడారు. అలాగే ఆయన చిన్నారులపై చూపే ప్రేమాభిమానాలను వివరించారు. నేటి బాలలే రేపటి పౌరులని, ప్రతి ఒక్క విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నతశిఖరాలను అధిరోహించాలని సూచించారు. పలువురు చిన్నారులు నెహ్రూ వేషధారణలలో అలరించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అలరించారు. ప్రతిభ చూపిన వారికి హెచ్‌ఎంలు, కరెస్పాండెంట్లు, ముఖ్యఅతిథులు బహుమతులు అందజేశారు. బాలలదినోత్సవం సందర్భంగా తాడిపత్రి పట్టణంలో అశోక్‌పిల్లర్ నుంచి పోలీస్‌స్టేషన్ సర్కిల్ వరకు విద్యార్థులకు పరుగు పోటీలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు క్రీడలు కూడా అవసరమన్నారు. ప్రస్తుత కాలంలో పిల్లలకు చదువుతప్ప బయటి ప్రపంచం తెలియదని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు పిల్లలకు బయట ప్రపంచం, బంధుత్వం తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. తర్వాత పోటీల్లోని విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు.

గాలివానకు నేలకొరిగిన మొక్కజొన్న

పుట్లూరు, నవంబరు14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట, కందికాపుల గ్రామాల్లో గురువారం సాయంత్రం వీచిన గాలివానకు మొక్కజొన్న పంట పూర్తిగా నేలకొరిగింది. సుమారు గంటపాటు కురిసిన వర్షానికి ఆరుగురు రైతులకు చెందిన మొక్కజొన్న పంట నేలకొరిగింది. గ్రామాల్లో సుమారు 15ఎకరాల్లోపు పంట నష్టం జరిగినట్లు తెలుస్తోంది.



చింతకుంటలో నేలకొరిగిన మొక్కజొన్న

వరిరైతులు విలవిల..

యల్లనూరు: మండలంలో కురిసిన వర్షానికి వరిరైతులు విలవిలలాడారు. గాలితో కూడి న వర్షం రావడంతో కోతదశలో ఉన్న వరి పంట నేలకొరిగింది. మండలకేంద్రంలో సుమారు 50శాతంపైగా వరిపొలాల్లో కోతలు జరిగాయి. ఆ ధాన్యాన్ని పొలాల్లోనే కుప్పలు పోశారు. వర్షం రావడంతో ఆ ధాన్యంను కాపాడుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

స్మార్ట్ మీటర్ల ప్రక్రియను రద్దు చేయాలి: సీపీఎం

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: విద్యుత్ స్మార్ట్ మీటర్ల ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని, అలాగే పలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయాల వద్ద సీపీఎం నాయకులు, కార్యకర్తలు గురువారం ప్రజాపోరు ముగింపు సందర్భంగా ధర్నా చేపట్టారు. అలాగే డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను తహసీల్దార్లకు అందజేశారు.



కళ్యాణదుర్గంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

● కళ్యాణదుర్గం పట్టణంలో జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్ ప్రసాద్ నాయకులు, కార్యకర్తలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం కార్యాలయం వద్ద కొద్దిసేపు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారిన విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. అలాగే ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై వేసిన భారాలను కూడా ఉపసంహరించుకోవాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, మహిళలు, దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తేవాలని కోరారు. తర్వాత ఈ మేరకు వినతిపత్రాన్ని ఆర్డీఓ కార్యాలయం ఏఓ ఈశ్వరమ్మకు అందజేశారు. సీపీఎం పట్టణ కార్యదర్శి రఘు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, నాయకులు ఈశ్వర్, రామచంద్ర, అశోక్, మహేష్, విక్రమ్, గోపాలప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● పెద్దవడుగూరు మండలకేంద్రంలో జరిగి న ధర్నాలో సీపీ ఎం మండల కార్యదర్శి దస్తగిరి, సహాయ కార్యదర్శి మద్దిలేటి, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

● రాయదుర్గం పట్టణంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున పార్టీ నాయకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు. నాయకులు మధు, తిమ్మరాజు, రమేష్, కృష్ణనాయక్, ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● గుంతకల్లు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం పట్టణ కార్యదర్శి బీ శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు మారుతిప్రసాద్, కసాపురం రమేష్, సభ్యులు కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రాన్ని అందజేశారు.

● గుత్తి పట్టణంలోనూ సీపీఎం నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. మండల కార్యదర్శి నిర్మల, నాయకులు మల్లికార్జున, రమేష్, మల్లేష్, రేవతి, రాము, తదితరులు పాల్గొన్నారు.

● ఉరవకొండ పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు ధర్నా చేశారు. నాయకులు రంగారెడ్డి, మధుసూదన్, వీరాంజనేయులు, దేవేంద్ర, రవికుమార్, జ్ఞానమూర్తి పాల్గొన్నారు.

● పామిడి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం సీనియర్ నేత అనిమిరెడ్డి మండల కార్యదర్శి మల్లేష్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి,ముత్యాలు, శ్రీనివాసులు ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ శ్రీధరమూర్తికి వినతిపత్రం అందజేశారు.

తాగునీటి ట్యాంక్‌ల ప్రారంభం

విడపనకల్లు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వివిధ ప్రాంతాలలో 7 తాగు నీటి ట్యాంక్‌లను టీడీపీ నాయకులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ సినిమా రామాంజనేయులు, పార్లమెంట్ కమిటీ సభ్యులు హనుమంతు, టీ రామాంజనేయులు, శీన, వీరన్న మాట్లాడుతూ.. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశాలతో మండల కేంద్రంలోని 7 ప్రాంతాల్లో తాగు నీటి ట్యాంక్‌లు నిర్మించినట్లు పేర్కొన్నారు. పీర్ల చావిడి, గౌరమ్మ ఆలయం, మఠం, శివాలయం, హాళిగమ్మ ఆలయం, మసీదు , జంబులింగేశ్వర ఆలయం ప్రాంతాల్లో మొత్తం రూ. 9లక్షల వ్యయంతో ట్యాంక్‌లు నిర్మించామన్నారు. 5ట్యాంక్‌ల వద్ద కొత్త బోర్లు వేయించి అక్కడే ట్యాంక్‌కు నీటిని నింపే పైపులను ఏర్పాటు చేశామన్నారు. మిగతా రెండింటికీ కొద్ది పాటి దూరం నుంచి పైపులైన్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.



పీర్లచావిడి వద్ద ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

ఇద్దరు ఎంపీడీఓలకు షోకాజ్ నోటీసులు?

అనంతపురం విద్య, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇద్దరు ఎంపీడీఓలకు జడ్పీ ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. బొమ్మనహాల్ ఎంపీడీఓ దాసానాయక్, వజ్రకరూరు ఎంపీడీఓ రవిప్రసాద్‌కు నోటీసులిచ్చినట్లు జడ్పీ వర్గాల ద్వారా తెలిసింది. ప్రభుత్వ పథకాల అమలులో వెనుకబడటంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ ఇద్దరికి నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. దీనిపై వివరణ కోసం గురువారం జిల్లాపరిషత్ సీఈఓ వెంకటసుబ్బయ్యకు ఫోన్ చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

రాయదుర్గంరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు కొన్నేళ్లుగా రేకుల షెడ్లల్లో తరగతులు నిర్వహిస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో గురువారం వెంకటరమేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పలు ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి రేకుల షెడ్డులలో తరగతులను నిర్వహిస్తున్నాయన్నారు. అంతేకాకుండా ఇష్టం వచ్చినట్లుగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులకు సరైన మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. విద్యాశాఖ అధికారి స్పందించి ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకుని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తాలుకా అధ్యక్షుడు శశికుమార్, ఉపాధ్యక్షుడు రాజు, నాయకులు భాను, రాజేష్, వినయ్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కణేకల్లు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ ఏడీఏ పద్మజ గురువారం తనిఖీ చేశారు. ఇందులో పలు దుకాణాల్లో రెండు కంపెనీలకు చెందిన రసాయన ఎరువులను సరైన బిల్లులు లేనందున వాటిని విక్రయించరాదని దుకాణాదారులకు ఆదేశించారు. రూ.4లక్షలు విలువైన 240లీటర్ల రసాయన మందుల విక్రయాలను నిలిపివేశారు. అలాగే 99 కేజీల ఎరువులను కూడా విక్రయించరాదని ఆదేశించినట్లు ఆమె తెలిపారు. వ్యవసాయ అధికారి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి తనిఖీ

గుత్తి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆర్డీఓ శ్రీనివాసులు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి పలు విభాగాలను, వైద్యుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం వైద్యులతో మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిటెండెంట్ ఎల్లప్ప, వీఆర్వో సురేంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అహుడా చైర్మన్‌కి ఘనస్వాగతం

గుత్తి రూరల్/పామిడి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : అహుడా చైర్మన్‌గా నియమితులైన తర్వాత విజయవాడ నుంచి మొదటి సారిగా అనంతపురానికి వెళ్తున్న జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్‌కు గుత్తిమండలం కరిడికొండ గ్రామశివారులోని 44వ జాతీయ రహదారిపై గురువారం కుటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున్న ఎదురేగి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనతరం టీసీ వరుణ్ బాట సుంకులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ, మండల, పట్టణ కన్వీనర్లు బర్దీ వలి, ఎంకే చౌదరి తదితరులు పాల్గొన్నారు. అలాగే టీసీ వరుణ్‌కు పామిడిలో జనసేన మండల అధ్యక్షుడు ధనుంజయ జనసైనికులతో కలిసి ఘన స్వాగతం పలికారు. గజమాల వేసి సత్కరించారు. ఎద్దులపల్లి సర్కిల్‌లోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి టీసీ వరుణ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అంజినాయక్, మహిళా నాయకురాలు లక్ష్మీదేవి, జనసేన మండల ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



పామిడిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న టీసీ వరుణ్

తెల్లారేలోగా పదవి పీకేయిస్తా..!

● పాఠశాల కమిటీ చైర్మన్‌పై హెచ్‌ఎం చిందులు

విడపనకల్లు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పాఠశాల తనిఖీకి వెళ్లిన కమిటీ చైర్మన్‌పై హెచ్‌ఎం చిందులు వేశాడు. చైర్మన్ పదవి పీకించేస్తానని బెదిరించాడు. విడపనకల్లులోని ఎస్‌డబ్ల్యూ పాఠశాలలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ సాల్మన్ రాజు పాఠశాలకు వెళ్లారు. రికార్డులలో విద్యార్థుల పూర్తి పేరు రాయాలని, లేదంటే విద్యార్థులు ఇబ్బంది పడతారని హెచ్‌ఎం రామాంజినేయులును కోరాడు. పాఠశాలకు సక్రమంగా రావాలని, విధులకు గైర్హాజరై వ్యక్తిగత పనులకు వెళ్లడం సరికాదని అన్నారు. దీంతో హెచ్‌ఎం రగిలిపోయారు. 'నన్ను ప్రశ్నించడానికి నువ్వెవరు..? నీదొక పెద్ద ఉద్యోగం.. నువ్వు నన్ను అడగడం..' అని హేళన చేశారు. 'చెప్పు.. ఎవరి దగ్గరకు పోదాం..? పయ్యావుల శీనప్ప దగ్గరకా..? సీఎం దగ్గరకా..? పొద్దు పుట్టేలోపల నీ చైర్మన్ పదవిని పీకేపిస్తా..' అని చిటికెలు వేస్తూ మరీ చాలెంజ్ చేశారు. అదే పాఠశాలలో పని చేస్తున్న ఓ ఉపాధ్యాయని సర్దిచెబుతున్నా సార్ ఏమాత్రం తగ్గలేదు. ఆయన చిందులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



హెచ్‌ఎం రామాంజినేయులు

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

గుంతకల్లుటౌన్,ఉరవకొండ/బొమ్మనహాళ్/ పుట్లూరు/ తాడిపత్రి/ పామిడి/ యాడికి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని గ్రంథాలయంలో గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను ఆర్డీఓ శ్రీనివాస్, ఎంఈఓ మస్తాన్‌రావు విడుదల చేశారు. తర్వాత గ్రంథాలయ అధికారి కమన్న పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు నిత్యం గ్రంథాలయానికి రావాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయ అధికారి హేమలత, రికార్డ్ అసిస్టెంట్ రాము, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఉరవకొండ పట్టణంలోని గ్రంథాలయంలో నిర్వహించిన వారోత్సవాల్లో ఎంఈవో ఈశరయ్య , గ్రంథాలయాల అధికారి ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే బొమ్మనహాళ్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయ వారో త్సవాలను నిర్వహించారు. గ్రంథాలయా ధికారి బాబుప్రసాద్ , ఎంఆర్‌సీ మంజు తదితరులు పాల్గొన్నారు. ఇక పుట్లూరు మండలకేంద్రంలోని గ్రంథాలయంలో నిర్వహించిన వారోత్సవాల్లో లైబ్రేరియన్ జయరాములు, పీఈటీ మురళీ, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. తాడిపత్రి పట్టణంలోని గ్రంథాలయంలో జరిగిన గ్రంథాలయ వారోత్సవాల్లో విశ్రాంత హెచ్‌ఎం సూర్యనారాయణరెడ్డి, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. పామిడి పట్టణంలోని గ్రంథాలయంలో జరిగిన వారోత్సవాల్లో ఎంఈఓ జయానాయక్ , గ్రంథాలయాధికారిణి వెంకటలక్ష్మి , విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

యాడికి మండలకేంద్రంలో జరిగిన వారోత్సవాల్లో గ్రంథాలయ అధికారి మధుసూదన్, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి లక్ష్మేంద్రకుమార్, సచివాలయ కార్యదర్శి హాజీబాషా, ఉపాధ్యాయుడు కొత్తరాయుడు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

కళ్యాణదుర్గంరూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోరేపల్లిలో గురువారం తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత వారం రోజులుగా గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొందని, గుక్కెడు నీరు కూడా దొరక్కపోవడంతో అల్లాడుతున్నామని వాపోయారు. స్థానిక అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. అందుకే నిరసన చేపట్టామన్నారు. ఇప్పటికైనా స్పందించి తాగునీటి సమస్య తీర్చాలని వారు కోరారు.



ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించిన మహిళలు

ప్రతిభావంత విద్యార్థినికి సన్మానం

డీ హీరేహాళ్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్యం గ్రామంలో గల బాల మేధావి ఇంగ్లిష్ మీడియం స్కూల్లో పదో తరగతి చదువుతున్న నవ్య గత నెల దక్షిణ భారత హిందీ ప్రచార కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన హిందీ పరిచయ ప్రాథమిక పరీక్షలో ప్రతిభ చూపింది. పాఠశాలకు చెందిన 81 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 80 మంది ఉత్తీర్ణత సాధించారు. అందులో నవ్య రెండు రాష్ట్రాల నుంచి మూడో ర్యాంకు సాధించింది. మారుమూల పల్లెలో వ్యవసాయ కుటుంబంలో జన్మించిన నవ్య తెలుగురాష్ట్రాల్లో ర్యాంకు సాధించడంతో గ్రామస్థులు, పాఠశాల సిబ్బంది గురువారం ఆనందం వ్యక్తం చేశారు. నవ్యను పాఠశాల కరెస్పాండెంట్ వన్నూరుస్వామి ఘనంగా సన్మానించారు.



విద్యార్థినిని సన్మానిస్తున్న దృశ్యం

కనకదాసు జయంతి మహాసభకు తరలిరండి

గుంతకల్లుటౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అనంతపురంలోని గుత్తిరోడ్డులో గల కేటీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 18న భక్తకనకదాసు జయంతి మహాసభ జరగనుందని, నియోజకవర్గంలోని కురుబలు పాల్గొని విజయవంతం చేయాలని కురుబ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సోమశేఖర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని బీరప్పస్వామి ఆలయంలో గురువారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అధికారకంగా నిర్వహించే కనకదాసు జయంతి మహాసభకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మంత్రి సవిత, హిందూపురం ఎంపీ పార్థసారథి, కర్నూలు ఎంపీ పంచలింగాల నాగరాజు, రాష్ట్రకురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ హాజరవుతారన్నారు. కురుబలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

కర్ణాటక సరిహద్దులో జోరుగా మట్కా

● నేమకల్లు గేటు కేంద్రంగా పేట్రేగిపోతున్న నిర్వాహకులు

● రోజుకు రూ.లక్షల్లో దందా

● అనంత, బళ్లారి ఎస్పీలే అరికట్టాలి

బొమ్మనహాళ్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో నేమకల్లు గ్రామ సమీపంలో గల గేటు ప్రాంతం వద్ద బళ్లారికి చెందిన కొందరు మట్కా వ్యాపారాన్ని జోరుగా సాగిస్తున్నారు. బళ్లారి, కళ్యాణదుర్గం వెళ్లే రోడ్డు గల ఆ గేటు ప్రాంతం కర్ణాటక పరిధిలో ఉండడంతో మట్కా నిర్వాహకులు జోరుగా తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు. నేమకల్లు గేటులో కొందరు అక్రమార్కులు గదులు అద్దెకు తీసుకుని బీటర్లను ఏర్పాటు చేసి బహిరంగగానే మట్కా పట్టీలు రాయిస్తున్నారు. మట్కాను పూర్తిగా నిరోధించాలని ఆంధ్రలో కూటమి ప్రభుత్వం గట్టిప్రయత్నాలు చేస్తోంది. అయితే కర్ణాటకకు చెందిన కొందరు మాత్రం మట్కాను పెంచి పోషిస్తున్నారు. నేమకల్లులో ప్రముఖ ప్రసిద్ధి చెందిన ఆంజనేయస్వామి దేవస్థానం ఉంది. స్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తులు నేమకల్లు గేటు నుంచే గ్రామంలోకి వెళ్లాల్సి ఉంటుంది. అయితే గేటు ప్రాంతం మట్కా నిర్వాహకులకు, మద్యం తాగేవారికి కేంద్రంగా ఉంది. దీంతో అక్కడ భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. నేమకల్లు గేటు తమ పరిధిలోకి రాదని బొమ్మనహాళ్ పోలీసులు జోక్యం చేసుకోవడం లేదు. బళ్లారికి చెందిన కొందరు పోలీసులకు మా మూళ్లు అందడం వల్లే మట్కా వ్యాపారం జోరుగా సాగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మట్కాతో రూ. 10కి రూ. 90 చొప్పున వస్తుందంటూ సామాన్య ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని రోజుకు రూ.లక్షల్లో దందా చేస్తున్నారు. కర్ణాటకలోని ఇంబ్రాపురానికి చెందిన కొందరు మట్కా ఏజెంట్లు పట్టపగలు మట్కా చీటీలు రాసిస్తూ డబ్బులు వసూళ్లు చేస్తున్నారు. సరిహద్దులో మట్కాను నియంత్రించడంలో అటు కర్ణాటక, ఇటు ఆంధ్ర పోలీసులతో పాటు నిఘా వర్గాలు దృష్టి సారించడం లేదు. సరిహద్దులో కర్ణాటక ఏజెంట్లు వచ్చి మట్కా నిర్వహిస్తుంటే పోలీసులు, నిఘా వర్గాలు ఇక్కడ నిద్రపోతున్నాయా అంటూ స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.



మట్కా పట్టీలు రాస్తున్న ఏజెంటు

బళ్లారి, అనంత ఎస్పీలే అరికట్టాలి:

నేమకల్లు గేటులో జరుగుతున్న మట్కాను అరికట్టేందుకు బళ్లారి, అనంతపురం జిల్లాల ఎస్పీలు ప్రత్యేక దృష్టి పెట్టాలని స్థానిక పోలీసులు కోరుతున్నారు. సరిహద్దులో జరిగే మట్కా కేంద్రాలపై నిఘా పటిష్టం చేయాలని, సరిహద్దు ప్రాంతంపై నిఘా పెంచి ఎప్పటికప్పుడు పోలీసులు దాడులు చేసి సామాన్య ప్రజలను మట్కా బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత అనంతపురం, బళ్లారి ఎస్పీలపై ఉందని స్థానిక ప్రజలు అంటున్నారు.

పాతకక్షలతో హత్యాయత్నం

కళ్యాణదుర్గం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కంబదూరు మండలం కురాకులపల్లికి చెందిన వెంకటస్వామిపై పాతకక్షలతో అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు, నరసింహమూర్తి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ మేరకు బాధితుడు గురువారం కంబదూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థలం విషయంలో వెంకటస్వామికి, శ్రీనివాసులు, నరసింహమూర్తికి మధ్య ఇటీవల ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో పాతకక్షలను మనసులో పెట్టుకుని వారు వెంకటస్వామిపై కత్తితో దాడి చేసి పొడిచారు. స్థానికులు వెంటనే అతడిని కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వెంకటస్వామి కోలుకుంటున్నాడు. గురువారం బాధితుడి ఫిర్యాదుతో కంబదూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

